Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక


www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 210 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 20 ఆగష్టు 2023 | ఆదివారం | పేజీలు : 4

## బిహార్‌లో జర్నలిస్ట్ దారుణ హత్య

న్యూఢిల్లీ : బిహార్‌లోని అరారియా జిల్లాల్లో ఓ జర్నలిస్టును గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు.. విమల్ కుమార్ యాదవ్ (35) దైనిక్ జాగరణ్ దినపత్రికలో క్రైమ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. తెల్లవారుజామున 4.30 గంటలకు రాణిగంజ్‌లోని ఆయన ఇంటి గేటు తీసుకొని నలుగురు దుండగులు లోపలికి ప్రవేశించారు. తలుపు తట్టి పిలి చిన వారు.. విమల్ డోర్ తీయగానే ఛాతీపై కాల్పులు జరిపారు. దీంతో విమల్ కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణం విడిచారు. అరారియా ఎస్పీ అశోక్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. గతంలో విమల్ సోదరుడి హత్య జరిగిందని.. ఈ ఘటనలో విమల్ ప్రత్యక్ష సాక్షిగా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ కేసు నిందితులే విమల్‌ను కూడా చంపి ఉండొచ్చని భావిస్తున్నట్లు చెప్పారు.

# కొత్తగూడెం, కల్వకుర్తి, జనగామ, ఘనపూర్, దేవరకొండ, చొప్పదండి...




# బీఆర్ఎస్ టికెట్ల కొట్లాట లెన్నో?

హైదరాబాద్ : అధికార పార్టీ అంటేనే టికెట్ల రగడ సహజం.. అందులోనూ రెండుసార్లు గెలిచి మూడోసారి దూకుడు మీదున్న పార్టీలో టికెట్ ల కోసం కొట్లాటల సంగతి చెప్పాల్సిన పనిలేదు. ఇక కొంత ఆకట్టుకునే నాయకత్వం ఉన్న పార్టీ అయితే ఈ రగడ మరీ అధికం. ఇలాంటి పరిస్థితే ప్రస్తుతం తెలంగాణ అధికార పార్టీ బీఆర్ఎస్ లో నెలకొంది. ఒకటి కాదు రెండు కాదు పైపైకి పది నియోజకవర్గాల్లో టికెట్ లొల్లి కనిపిస్తోంది.

నేనంటే నేనంటూ నాయకులు పైచేయికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్రావు ఎన్నిక చెల్లదంటూ రాష్ట్ర హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. వనమా చేతిలో ఓడిన జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా ప్రకటించింది. దీనిని అనుసరించి అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ ఆయన అదేమీ చేయలేదు. ప్రమాణ స్వీకారానికి జలగంను పిలవలేదు. కాగా, ఇదే నియోజకవర్గంలో ఇప్పటికే తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారిక పదవిలో ఉన్నప్పటికీ చాలా దూకుడుగా వెళ్తున్నారు.

**పెద్దల సమక్షంలోనే పంచాయితీ :** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ బీఆర్ఎస్ లో అసమ్మతి భగ్గుమంది. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తమకు గౌరవం ఇవ్వడం లేదని, ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని నాయకులు గళమెత్తారు. అది కూడా ఎమ్మెల్యే సమక్షంలోనే కావడం గమనార్హం. ఇదే సమావేశంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్ కుమార్ కూడా పాల్గొన్నారు. వారి ముందే నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, పీఏసీఎస్ ఛైర్మన్లు, ఇతర నాయకులు ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. అంటే మొత్తం నియోజకవర్గ నాయకత్వమే ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉంది.

పోలీసులు, అధికారులను అడ్డు పెట్టుకుని సొంత పార్టీ నాయకులనే ఇబ్బంది పెడుతున్నారని అన్నట్లు తెలిసింది. దళిత బంధు, బీసీలకు సాయం విషయంలో తమ సూచనలను విస్మరిస్తున్నారని, ఆయనకు నచ్చినవారికే చోటిచ్చారని కొందరు ఆరోపించినట్లు చెబుతున్నారు.

**జనగామలో జగడ జగడ :** పలుసార్లు వివాదాస్పదుడైన జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి రెండుసార్లు గెలిచి మూడోసారీ టికెట్ నాదే అంటున్నారు. ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి పోటీ చేస్తారంటూ జనగామ జడ్పీ చైర్మన్ ఆడియో వైరల్ కావడం సంచలనం రేపింది. అయితే, పల్లా కాదు తానే పోటీకి దిగుతున్నట్లుగా ముత్తిరెడ్డి ప్రకటించారు. వాస్తవానికి వివాదాలతో ముత్తిరెడ్డికి టికెట్ గండం పొంచి ఉందని చెబుతున్నారు. అందుకనే సీఎం కేసీఆర్ కు సన్నిహితుడైన పల్లాను దింపుతున్నట్లు ప్రచారం చేస్తున్నారు. కానీ, సీఎం చేయించిన సర్వేలో జనగామ టాప్ 10లో ఉందని టికెట్ నాదేనని ముత్తిరెడ్డి చెబుతున్నారు.

**దేవర.. దేవర.. రవీంద్రకు వద్దురా..** గిరిజన రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన దేవరకొండలోనూ టికెట్ లొల్లి సాగుతోంది. ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కు మళ్లీ టికెట్ ఇవ్వొద్దంటూ కార్యకర్తలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆయన వ్యవహార శైలి కూడా బాగోలేదని ధ్వజమెత్తారు. రవీంద్రకు వ్యతిరేకంగా ఏకంగా తీర్మానం కూడా చేశారు. వీరిలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, డిండి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వంటి కీలక నేతలు ఉండడం గమనార్హం. ఇక కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కు మళ్లీ టికెట్ ఇవ్వొద్దంటూ ఇటీవల ఆ నియోజకవర్గ నాయకులు ఓ ఫాంహౌజ్ లో సమావేశమయ్యారు. దీనిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కూడా పాల్గొనడం గమనార్హం. స్టేషన్ ఘనపూర్ లో మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎమ్మెల్యే రాజయ్య మధ్య ఉన్న వివాదం బహిరంగ రహస్యమే. ఇలా ఇంకెన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల మీద వ్యతిరేకత ఉందో..?

## సీఎం కేసీఆర్‌పై నా మాటలను వక్రీకరించారు

హైదరాబాద్: సీఎం కేసీఆర్‌పై తాను చేసిన మాటలను వక్రీకరించారని బీజేపీ జాతీయ నేత మురళీధరరావు అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... యువకులు కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో అసంతృప్తితో ఉన్నారని తెలపారు. బీజేపీ యువత మీద దృష్టి పెట్టాలని సూచించారు. యువకులే కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించేది అంటూ చెప్పుకొచ్చారు. కేసీఆర్ వైఫల్యాలపై దృష్టి పెడితే కేసీఆర్‌ను ఓడించడం ఈజీ అని అన్నారు. ఇప్పటికే బీజేపీ డబుల్ బెడ్ రూం ఇండ్ల సమస్యపై



బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. 2014లో, 2018లో కాంగ్రెస్ పార్టీని ప్రతిపక్షం అనుకొని ప్రజలు ఓటు వేశారని.. కాంగ్రెస్‌కు ఓటు వేసిన, బీఆర్ఎస్‌కు వేసినట్లే అని అన్నారు. అందుకే బీఆర్ఎస్‌కు బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయ పార్టీ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకొని ఆయా రాష్ట్రాలకు వెళ్ళి కేసీఆర్ షో చేశాని వ్యాఖ్యలు చేశారు. జాతీయస్థాయిలో కేసీఆర్ తిరుగుతున్నప్పుడు కర్ణాటక ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఎందుకు పోలేదని ప్రశ్నించారు. మహారాష్ట్రకు పోతున్నారని.. జాతీయ పార్టీగా అవతరించిన తర్వాత బీఆర్ఎస్ వైఫల్యం స్పష్టంగా కనపడుతోందని బీజేపీ జాతీయ నేత మురళీధరరావు పేర్కొన్నారు.

# అత్తారింటివైపు చూస్తున్న కేసీఆర్... కన్ ఫాం చేస్తోన్న సీనియర్!

హైదరాబాద్ : తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తోన్న వేళ రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయని అంటున్నారు. ఇందులో భాగంగా పార్టీ అధినేతలు సైతం తాము పోటీ చేసే నియోజకవర్గాల విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుంటున్నారని తెలుస్తోంది. ఈ సమయంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ పోటీ చేయబోయే నియోజకవర్గంపై కీలక చర్చ తెరపైకి వచ్చింది. 2014, 2018 ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గ్రాండ్ విక్టరీ సాధించారు కేసీఆర్. ఈ సమయంలో మరోసారి అక్కడి నుంచే పోటీ చేసి హ్యాట్రిక్ కొడతారని కొంతమంది అంటుంటే... లేదు ఈసారి మరో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని చెబుతున్నారు ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే! అవును... బీఆరెస్ జాతీయ రాజకీయాల భవిష్యత్తును నిర్దేశించేవి, నిర్ణయించేవిగా రాబోయే ఎన్నికలను భావిస్తున్నారంట ఆ పార్టీ నేతలు. ఇదే క్రమంలో కేసీఆర్ పోటీ చేసే అసెంబ్లీ నియోజకవర్గంలో మార్పు ఉంటుందని, ఈసారి కామారెడ్డి నుంచే పోటీ చేస్తారని అంటున్నారు.. ఆ పార్టీ కామారెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్. ఈ సమయంలో... ముఖ్యమంత్రి కేసీఆర్ నూటికి నూరుశాతం కామారెడ్డి నుంచి పోటీ చేస్తారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. ఇదే సమయంలో తాను కేసిఆర్ ను కామారెడ్డిలో పోటీ చేయాలని మూడుసార్లు కోరినట్లు తెలిపారు. ఒక సామాన్య కార్యకర్తగా తాను ఉండి కేసీఆర్ ను గెలిపించుకుంటానని గంప గోవర్ధన్ చెప్పారు. అలా ఎందుకు కోరుతున్నారు అనే కనిపించని కారణం సంగతి కాసేపు పక్కనపెడితే... కనిపించే కారణం కూడా బలంగా ఉంది. కామారెడ్డి నియోజకవర్గంలోని కోనాపూర్ కేసీఆర్ అత్తగారి గ్రామం! దీంతో గంప గోవర్ధన్ చెప్పేది నిజమైతే ఈసారి కేసీఆర్ అత్తారింటి నుంచి పోటీ చేయబోతున్నారన్నమాట అని అంటున్నారు! అయితే అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా గజ్వేల్, కామారెడ్డి రెండు చోట్ల నుంచి పోటీ చేస్తారా.. లేక, గజ్వేలు ను ఆపి కామారెడ్డికి షిఫ్ట్ అవుతారా అన్నది మాత్రం క్లారిటీ రావాల్సి ఉంది! మరోపక్క రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ ఈసారి తెలంగాణ నుంచి ఒకచోట.. మహారాష్ట్ర లో రెండు చోట్లా పోటీ చేయబోతున్నారనే చర్చ రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోందని తెలుస్తుంది. ఇందులో భాగంగా... మహారాష్ట్రలోని నాందేడ్, ఔరంగాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీచేస్తే ఎలా ఉంటుందనే విషయమై సీరియస్ గా ఆలోచిస్తున్నారని అంటున్నారు. టీఆరెస్ నుంచి బీఆరెస్ గా మారిన తర్వాతనుంచి కేసీఆర్ ఇలా ఏ విషయంలో నైనా మహారాష్ట్రను కూడా దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తుండటం గమనార్హం. పార్లమెంటు ఎన్నికల సంగతి కాసేపు పక్కనపెడితే... రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ అత్తారింటినుంచే పోటీ చేస్తారా.. గోవర్ధన్ చెబుతున్నట్లు కామారెడ్డి నియోజకవర్గాన్నే ఎన్నుకుంటారా అనేది వేచి చూడాలి. కాగా..



కామారెడ్డి నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న గంప గోవర్ధన్ ఇప్పటివరకు అక్కడినుంచే ఐదుసార్లు ఎన్నికైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... 1994, 2009 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపిందిన ఆయన... 2012, 2014, 2018 ఎన్నికల్లో టీఆరెస్ (బీఆరెస్) నుంచి గెలిచారు.



# తెలంగాణ రాబడి అదరహో..!

## పెరిగిన రెవిన్యూ వసూళ్లు..!!

## బలమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ

హైదరాబాద్ : తెలంగాణ ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. కేంద్రం నుంచి మద్దతు లేకపోయినా స్వయంగా గణనీయ వృద్ధి రేటును నమోదు చేస్తున్నది. కాగ్ మొదటి త్రైమాసిక నివేదికను వెల్లడించింది. అందులో తెలంగాణ ఏటికేడు ఆర్థికంగా బలపడుతున్న తీరును వర్ణించింది. వనరులను సద్వినియోగం చేసుకొంటూ ఆర్థికంగా బలపడుతున్నది. రాబడిలో ఎక్కువ మొత్తం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసమే రాష్ట్రం వెచ్చిస్తోంది. ఆర్థిక నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తోంది.

ప్రణాళికా బద్దంగా:తెలంగాణ ప్రభుత్వ ఆర్థికంగా బలోపేతం దిశగా ప్రణాళికా బద్దంగా ముందుకెళ్తోంది. కాగ్ మొదటి త్రైమాసిక నివేదికను వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వివిధ రూపాల్లో రాష్ట్రానికి రూ.2,59,861.91 కోట్లు సమకూరుతుందని బడ్జెట్‌లో అంచనా వేసింది. మొదటి త్రైమాసికంలో అంటే.. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కలిపి మొత్తం రూ.50,910.11 కోట్లు ఖజనాకు చేరాయి. అంటే.. బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఇప్పటికే సుమారు 20 శాతం ఆదాయం సమకూరింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,45,256.61 కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో అంచనా వేయగా, నిరుడు జూన్ వరకు రూ.43,550.51 కోట్లు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సారి రూ.7,359.6 కోట్లు అధిక ఆదాయం సమకూరింది.

**ఏటికేడు బలపడుతూనే :** తెలంగాణకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులివ్వకుండా కేంద్రం కొర్రీలు పెడుతుతోంది. తెలంగాణ మాత్రం ఆర్థికంగా ఏటికేడు బలపడుతూనే ఉంది. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో జీఎస్టీ రాబడే అగ్రస్థానంలో నిలిచింది. అమ్మకం పన్ను రూపంలో రూ.7,532.96 కోట్లు, కేంద్ర పన్నుల వాటా రూ.2,988.88 కోట్లు, పన్నేతర రాబడి రూ.1,488.10 కోట్లు రాబడి వచ్చింది. ప్రధాన వ్యయాలను పరిశీలిస్తే రెవెన్యూ ఖాతా ఖర్చు రూ.15,406.89 కోట్లు ఉన్నది. వేతనాల కోసం రాష్ట్రం వెచ్చించింది రూ.9,796.83 కోట్లు. రాష్ట్రంలోని వివిధ వర్గాలకు పింఛన్ల రూపంలో రూ.4,158.57 కోట్లు వెచ్చించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి జీఎస్టీ రూపంలో రూ.50,942.49 కోట్లు వస్తుందని ఆర్థిక అంచనా వేయగా, మొదటి త్రైమాసికానికి రూ.11,418.47 కోట్లు వసూలైంది. బడ్జెట్ అంచనాల్లో ఇది 22 శాతంగా నమోదైంది. ఆర్థికంగా బలమైన శక్తిగా:స్టాంపులు, రిజిస్ట్రేషన్ల రూపంలో రూ.18,500 కోట్లు వస్తుందని రాష్ట్ర ఆర్థికశాఖ అంచనా వేయగా, జూన్ నాటికి రూ. 3,510.63 రాబడి సమకూరింది. ఇలా.. జూన్ నెల వరకు రాష్ట్రానికి రూ.50,910.11 కోట్లు సమకూరగా, అన్నింటికీ కలిపి రూ.47,290.64 కోట్లను రాష్ట్రం ఖర్చు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రూపం లో రూ.42,189.47 కోట్లు వస్తుందని రాష్ట్ర ఆర్థికశాఖ అంచనా వేయగా.. మొదటి త్రైమాసికానికి రూ. 9,645.14 కోట్లు వచ్చింది.గత ఏడాదితో పోలిస్తే జీఎస్టీ రూ.1,773.33 కోట్లు అధిక రాబడి వచ్చింది. తొమ్మిదేళ్ల కాలంగా పక్కా ప్రణాళికా బద్దంగా వేస్తున్న అడుగులతో రాష్ట్రం ఆర్థికంగా బలమైన శక్తిగా ఎదగటానికి అవకాశం దక్కింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ అదే విధంగా ముందుకు దూసుకెళ్తోంది.

# సంపాదకీయం

## ప్రకృతిలో అయిదో శక్తి... అద్భుతం సృష్టించబోతున్నారా?

న్యూటన్ శక్తి నిత్యత్వ సూత్రం ప్రకారం... శక్తిని సృష్టించలేము, నాశనం చేయలేదు.. కాకపోతే ఒకరూపం నుంచి మరో రూపానికి మార్చగలము! అయితే అలా కాదు... శక్తిని సృష్టించగలమని చెబుతూ ప్రయోగాలు చేస్తున్నారు షికాగోకు చెందిన శాస్త్రవేత్తలు. పైగా ఈ విషయంలో దగ్గరకు వచ్చినట్లు చెబుతున్నారు. అవును... ప్రకృతిలో అయిదో శక్తిని కనుగొనడంలో తాము సమీప దూరానికి వచ్చినట్లు షికాగోకు చెందిన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సబ్ ఆటమిక్ పార్టికల్స్ మ్యుయాన్స్ ప్రస్తుత సబ్ ఆటమిక్ ఫిజిక్స్ సిద్ధాంతాల ప్రకారం ఉన్న అంచనాల తరహాలో భిన్నంగా ప్రవర్తిస్తున్నాయనడానికి శాస్త్రవేత్తలు ఆధారాలు కనుగొన్నారని తెలుస్తోంది. ప్రతి రోజూ మనం అనుభూతి చెందే శక్తులను నాలుగు కేటగిరీల కింద వర్గీకరించారు. అవి... గురుత్వాకర్షణ శక్తి, విద్యుదయస్కాంత శక్తి, బలమైన అణు శక్తి, బలహీన అణు శక్తి. విశ్వంలోని అన్ని పదార్థాలు, రేణువులు ఒకదానితో ఒకటి ఎలా అసంధానమవుతాయన్నది ఈ నాలుగు శక్తులు నియంత్రిస్తాయి. అయిదో శక్తికి సంబంధించిన అంశాలను అమెరికా పార్టికల్ యాక్సిలేటర్ ఫెసిలిటీ ఫెర్మిలాబ్ లో కనుగొన్నారు. 2021లోనే తొలిసారి ఈ ఫలితాలపై ఒక ప్రకటన చేశారు. ఆ సందర్భంగా విశ్వంలో అయిదో శక్తికి అవకాశముందని ఫెర్మిల్యాబ్ టీమ్ సూచించింది. అప్పటి నుంచి ఈ పరిశోధన బృందం మరింత డేటాను సేకరించే పనిలో ఉంది! ఈ నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా ఐదో శక్తి ఉనికి సంచలనం కలిగిస్తోంది. ఫెర్మిల్యాబ్ శాస్త్రవేత్తలు "జీ మైనస్ 2" ప్రయోగంతో దీన్ని గుర్తించారు. ఈ ప్రయోగంలో మ్యూయాన్స్ అనే ఉప పరమాణు కణాలను 50 మీటర్ల వ్యాసం కలిగిన రింగు ద్వారా అతి వేగంగా కదిలించారు. దీన్ని దాదాపు కాంతి వేగం వద్ద 1000 రెట్ల వేగంతో ప్రవహించేలా చేశారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే... మ్యూయాన్స్ అనేవి అణువుల చుట్టూ తిరిగే ఎలక్ట్రాన్ల మాదిరి ఉప పరమాణు కణాలే. కానీ ఇవి సుమారు 200 రెట్లు పెద్దగా ఉంటాయి. ఫెర్మిల్యాబ్ శాస్త్రవేత్తలు వీటిని సూపర్ కండక్టింగ్ అయస్కాంతాల సాయంతో అటూఇటూ ఊగేలా చేయగా... ఇవి ఊహించిన దాని కన్నా చాలా వేగంతో ఊగిసలాడాయి. మ్యూయాన్స్ ఈ విచిత్ర ప్రవర్తనకు కొత్త శక్తి ప్రభావమే కారణమని భావిస్తున్నారు. దీన్నే ఐదో ప్రాథమిక శక్తిగా ఊహిస్తున్నారు. ఒకవేళ ఇది ధ్రువీకరణ అయితే... ఐన్ స్టీన్ సాపేక్షక సిద్ధాంతాల నుంచి ఇప్పటివరకు వందల ఏళ్లలో చేపట్టిన అతిపెద్ద సైన్స్ అద్భుతావిష్కరణలో ఇదొకటి కానుంది.

# బదిలీలకు ని'బంధ'నాలు



భూపాలపల్లి : ఓ వైపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. మరోవైపు రాష్ట్రస్థాయి పైరవీలతో బదిలీలు చేస్తుండటంతో అయోమయం నెలకొంది. విద్యాశాఖ అధికారులు ప్రస్తుతం అర్హుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయడంతో పాటు సీనియారిటీ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. గ్రేడ్-2 గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీకి మొదట ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు అర్హులని ప్రభుత్వం పేర్కొంది. తర్వాత అయిదేళ్లకు కుదించడంతో అందుకు అనుగుణంగా జాబితాలను సిద్ధం చేశారు. డీఎస్సీ, రిజర్వేషన్ మెరిట్ ఆధారంగా జాబితాలు పొందుపర్చారు. అయితే.. వేర్వేరు పద్ధతుల్లో సీనియారిటీ జాబితాను తయారు చేయడంతో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**317 జీవోతో**

317 జీవో ప్రకారం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు కొత్త స్థానికత అమలులో వారు గతంలో కోల్పోయిన సర్వీసును పరిగణించకపోవడంతో వారు జూనియర్లుగా గుర్తించబడుతున్నారు. కొందరు తమ స్పౌజ్ కేసులకు సంబంధించి పనిచేస్తున్న జిల్లా, జోన్‌లను విడిచి వేరొక జిల్లా, జోన్‌కు కేటాయించబడ్డారు. భార్యా భర్తలు వేరువేరు జిల్లాల్లో సుమారు వంద కిలోమీటర్లకు పైగా దూరంలో పనిచేయడంతో వారు మానసికంగా, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా న్యాయం చేసి, తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరుతున్నారు. ఇప్పటివరకు స్పౌజ్ కేసుల్లో జిల్లా నుంచి కేవలం 18 మంది బదిలీ అయ్యారు. ఇంకా బదిలీ కావల్సిన వారు చాలా మంది ఉన్నారు. అదేవిధంగా భాషా పండితులకు పదోన్నతుల విషయంలో ప్రభుత్వం మొండిచేయి చూపడంతో వారు ఫిబ్రవరి 1 నుంచి 9,10 తరగతుల విద్యార్థులకు భాషా బోధన నిలుపుదల చేస్తామని తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఐక్య వేదిక నాయకులు తెలిపారు. ఇదే విషయంపై రెండు రోజుల క్రితం డీఈవోకు వినతిపత్రాన్ని ఇచ్చారు. పైరవీలతో నిర్వహించే బదిలీలు నిలుపుదల చేయాలని, జీరో సర్వీసు బదిలీలకు అనుమతివ్వాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

**కోర్టు పేరుతో నష్టం చేయకండి..**

– గడ్డం లక్ష్మయ్య, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు

భాషా పండితులకు పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక షెడ్యూల్‌ను విడుదల చేయాలి. కోర్టు కేసుల సాకుతో ప్రభుత్వం భాషా పండితులపై నిర్లక్ష్య వైఖరి తగదు. వికలాంగుల కోటలో నిబంధనలు కచ్చితంగా పాటించి, పదోన్నతులు చేపట్టాలి. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలి. వంద మార్కులకు బోధించే భాషా పండితులకు పదోన్నతులు కల్పించకుండా 50 మార్కులు బోధించే వారికి పదోన్నతులు కల్పించడం విడ్డూరం.

**దొడ్డిదారిన తగదు..** – మధుసూదన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం చేపడుతున్న పదోన్నతులు, బదిలీల విషయంలో ఓవైపు అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సహకరించాలని కోరుతూనే దొడ్డిదారిన బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. స్థానికతను కోల్పోయి 317 జీవో ప్రకారం నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయకుండా, పెండింగ్ కేసులు పరిష్కరించకుండా, పూర్తి స్థాయిలో స్పౌజ్ కేసులకు సంబంధించి ఉపాధ్యాయులకు న్యాయం చేయకుండా బదిలీలు చేపట్టడం సరైంది కాదు.

**స్పష్టమైన ఉత్తర్వులు రాకపోవడంతో..** – సుభాకర్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

రాష్ట్ర విద్యాశాఖ నుంచి స్పష్టమైన రాతపూర్వక ఉత్తర్వులు విడుదల చేయకపోవటంతో జిల్లాకోలా సీనియారిటీ జాబితాలను రూపొందించడంతో కొందరు ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. కోర్టు కేసుల పేరుతో పండిట్, పీఈటీలకు పదోన్నతులు కల్పించకపోవడం సరైంది కాదు. జీరో సర్వీసును పరిగణలోకి తీసుకోవాలి.

# నత్తనడకన సమీకృత మార్కెట్ల నిర్మాణం

హుజూరాబాద్: జిల్లాలోని మూడు పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఒప్పంద గడువు ముగిసినా పనులు మాత్రం ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణలేమి.. గుత్తేదారు అలసత్వం వల్లే నిర్మాణంలో జాప్యం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.. తరుచూ గడువు పొడిగిస్తున్నారే తప్ప సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం లేదు. విక్రయదారులు.. వినియోగదారులకు ఎంతో సౌకర్యంగా ఉండే ఈ మార్కెట్లను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**పనులు పూర్తయ్యేదెప్పుడో..?**

తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, పట్టణ ప్రగతి ప్రత్యేక నిధులతో కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు.. ఇలా అన్ని రకాల వస్తువులు ఒకే చోట విక్రయించేలా వేర్వేరు భవనాలు నిర్మించేందుకు సమీకృత మార్కెట్లకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇందుకోసం హుజూరాబాద్ పురపాలికలో రూ.4.50 కోట్లు, జమ్మికుంటలో రూ.3 కోట్లు, చొప్పదండిలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. అమ్మకందారులు, కొనుగోలుదారుల వాహనాలు నిలిపే ప్రదేశం, సరకులను దించడానికి, ఎత్తడానికి అవసరమైన వేదిక, మూత్రశాలలు, మరుగుదొడ్లు, మార్కెట్ నిర్వహణ, పర్యవేక్షణకు ప్రత్యేకంగా కార్యాలయం, విద్యుత్తు దీపాలు, ప్రహరీ తదితర సకల సౌకర్యాలతో ఆర్నెల్లలోగా



వీటిని నిర్మించాలనేది ప్రధాన లక్ష్యం. కానీ హుజూరాబాద్ ఉప ఎన్నికల నేపథ్యంలో 2021 జులైలో హడావుడిగా జమ్మికుంటలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినా ఇంకా పిల్లర్ల దశలోనే ఉంది. హుజూరాబాద్‌లోని సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు స్థలం కేటాయింపు ఆలస్యం కావడంతో 2022 మే 14న పనులు ప్రారంభించారు. గత డిసెంబరులోనే పూర్తి చేయాలనే ఒప్పందం ఉన్నా ఇంకా పిల్లర్ల దశ దాటలేదు. సివిల్ పనులతోపాటు విద్యుత్తు, నీటి సరఫరా, ఫ్లోరింగ్, ప్రవేశ ద్వారాలు, పార్కింగ్, మరుగుదొడ్లు తదితర పనులను ఇంకా మొదలుపెట్టలేదు. గడువులోగా పనులు పూర్తి కాకపోవడంతో మళ్లీ మార్చి నెలాఖరు వరకు పొడిగించారు. చొప్పదండి పురపాలికలో సమీకృత మార్కెట్ నిర్మాణంలో కూడా జాప్యం జరుగుతోంది. వ్యవసాయ మార్కెట్‌లోని ఓ షెడ్డులో దీన్ని నిర్మిస్తుండగా ప్లాట్‌ఫారాలు, ఇతర పనులు పూర్తి చేయలేదు. మొత్తంగా మూడు పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు 50 శాతానికి మించి పూర్తి కాలేదు. మూడు పురపాలికల్లో ఒకే గుత్తేదారు పనులు చేస్తుండగా, బిల్లులు సరిగ్గా రావడం లేదని ఆలస్యం జరుగుతోందని చెబుతుండగా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు.

# మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ ఏదీ?



జనగామ : మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకుల అనుసంధాన పథకం, స్త్రీనిధి, పొదుపు నిధి నుంచి రుణాలు ఇస్తున్నారు. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా తొలుత పావలా వడ్డీకి రుణాలు అందజేశారు. ఆ తర్వాత వడ్డీ లేని రుణ (వీఎల్‌ఆర్) పథకాన్ని 2015-16 నుంచి అమలు చేస్తున్నారు. తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లించిన పొదుపు సంఘాలకు ప్రభుత్వం వడ్డీ రాయితీ పథకాన్ని ప్రకటించింది. చెల్లించిన వడ్డీని తిరిగి బ్యాంకుల ద్వారా వారి ఖాతాలకు జమ చేయడం ఈ పథకం ఉద్దేశం. జనగామ పురపాలిక పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు మూడేళ్లుగా వడ్డీ రాయితీ రావడం లేదు. దీంతో సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**పొదుపు.. రుణాలే ఉపాధిగా..**

పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు ప్రభుత్వపరమైన ఉపాధి అవకాశాలు ఉండవు. దీంతో వారు నిర్మాణ రంగం, దుకాణాలు, ఇళ్లలో పనులు, చిరు, వీధి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. పట్టణంలోని పేద మహిళల కోసం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా పలు పథకాలు అమలవుతున్నాయి. బ్యాంకులు, ఇతర పథకాల ద్వారా రుణాలు ఇస్తున్నారు.

**తిరకాసులు..తిప్పలు:**

పొదుపు సంఘాల సభ్యులకు వడ్డీ రాయితీ అందజేసేందుకు తిరకాసులు ఉన్నాయి. క్రమం తప్పకుండా నెలవారీ కిస్తులు చెల్లించాలి. రుణంతో పాటు నిర్దేశిత వడ్డీని సకాలంలో చెల్లించాలి. రూ.100కు 80 పైసల నుంచి రూపాయి వరకు వడ్డీ చెల్లిస్తున్నామని మహిళలు అంటున్నారు. తీసుకున్న అప్పును వడ్డీతో సహా చెల్లించినప్పుడు ఆర్నెల్లలోపు వారి ఖాతాలకు వడ్డీ రాయితీ సొమ్మును జమ చేయాల్సి ఉంది. ఒకటి, రెండు మాసాలు ఆలస్యంగా చెల్లించినా రాయితీ అందని పరిస్థితులు ఉన్నాయి.

జనగామ మున్సిపల్ పరిధిలో గత డిసెంబరు నివేదికను అనుసరించి 934 పొదుపు సంఘాలు, 35 వార్డు కమిటీలు, ఒక పట్టణ కమిటీ పరిధిలో సుమారు 9 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. పొదుపు, రుణ స్వీకరణ, చెల్లింపుల కార్యక్రమాలు సాఫీగా జరుగుతున్నాయి. 2015-16 నుంచి 2022 వరకు గణాంకాలను పరిశీలిస్తే, నానాటికీ వడ్డీ రాయితీ పొందే సంఘాల సంఖ్య తగ్గిపోతుండటం గమనార్హం.

**ఎందుకీ తరుగుదల ?**

2015-16 నుంచి 2018-19 వరకు 900 సంఘాలకు గాను 500 పైగా సంఘాలకు వడ్డీ రాయితీ లభించింది. గత రెండేళ్ల లెక్కలను పరిశీలిస్తే 200 లోపు సంఘాలు మాత్రమే రాయితీ పొందేందుకు అర్హత సాధించాయి. జనగామలో రూ.20 లక్షల వరకు అప్పు తీసుకుంటున్న సంఘాలున్నాయి. రూ.7.50 లక్షల వరకు బ్యాంకు లోన్ తీసుకొని సక్రమంగా చెల్లించిన సంఘాలకే వడ్డీ రాయితీ వర్తిస్తుందంటున్నారు. దీంతో పేద మహిళలు అధిక రుణం తీసుకొని, అధిక మొత్తంలో వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

**అన్ని గ్రూపులకు వర్తింపజేయాలి**– ఆకుల సరిత, మెప్మా జనగామ పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు

2019-20 నుంచి వడ్డీ రాయితీ రావడం లేదు. ఎంత రుణం తీసుకున్నా వడ్డీరాయితీ పథకాన్ని వర్తింపజేయాలి. వెంటనే బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

**ప్రతిపాదన పంపించాం**– రాజేందర్, పట్టణ మెప్మా అధికారి

ఎన్ని గ్రూపులకు వడ్డీ రాయితీ వర్తిస్తుందనేది మా పరిధిలో ఉండదు. బ్యాంకు నుంచి రుణాలు తీసుకొని చెల్లించే వారి వివరాలను మెప్మా ప్రధాన కార్యాలయం పర్యవేక్షిస్తుంది. అక్కడి నుంచే రాయితీకి అర్హత కలిగిన సంఘాల వివరాలు వస్తాయి. బకాయిల వివరాలతో ప్రతిపాదన పంపించాము. నిధులు వస్తే నేరుగా వారి ఖాతాలకు జమ అవుతాయి.

# మానేరులో ఇసుక మాఫియా జోరు

కరీంనగర్ : మానేరు నుంచి అడ్డూ అదుపు లేకుండా యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. రేయింబవళ్లు అనే తేడా లేకుండా బొమ్మకల్, చేగుర్తి, దుర్శేడు, ఇరుకుల్ల గ్రామ శివారు ప్రాంతాల్లో వాగు నుంచి వందలాది ట్రాక్టర్లలో నగరానికి అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో శబ్దానికి నిద్రపట్టడంలేదని పలువురు గ్రామస్థులు 100కు డయల్ చేసినా, చర్యలు నామమాత్రంగా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. వేగంగా నడిపించడంతో రాత్రి రోడ్డుపైకి రావడానికి జనాలు జంకుతున్నారు. తక్కువ వేతనానికి అందుబాటులో ఉండటంతో ఎక్కువ శాతం మైనర్లే డ్రైవర్ల అవతారమెత్తుతున్నారు.

**బాటలు వేసుకొని మరీ..**

బొమ్మకల్ గ్రామ శివారులో వాగులో నుంచి ట్రాక్టర్లు బయటకు రావటం కష్టంగా ఉందని, ఏకంగా వాటిలో ఇటుకను తరలించి, వాగులో బాటలు వేసుకొని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా యంత్రాంగం ఏం చేస్తోందని ప్రజలు విస్తుపోతున్నారు.

**మద్యం మత్తులో..**

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు రాత్రి నడిపే వారిలో ఎక్కువ శాతం మంది మద్యం తాగి నడుపుతున్నారు. మైనర్లకు మద్యం ఎర చూపి వారిని చోదకులుగా ఎంచుకొని దందా కొనసాగిస్తున్నారు. రాత్రి అయితే నిఘా తక్కువగా ఉంటుంది. ఆ సమయం అనుకూలంగా భావించి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. వాగు నుంచి బొమ్మకల్ ఇళ్ల మధ్య నుంచి కరీంనగర్ రావాల్సి ఉంటుంది. రాత్రి అయిందంటే వాహనాల మోత మొదలవుతోంది. రహదారికి ఇరువైపులా ఇళ్ల వారు శబ్దంతో నిద్రకు దూరమవుతున్నారు.

**బ్లూకోల్ట్స్ పోలీసులు ఎక్కడ?**

గ్రామంలోని పలువురు యువకులు, వృద్ధులు 100కు డయల్ చేసి ఫిర్యాదు చేస్తే బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు వచ్చి అదుపులోకి తీసుకోవాలి. కానీ అలా జరగడం లేదు. ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందగానే పోలీసులు గ్రామంలోకి వస్తారు. వారు రాగానే యజమానులకు సమాచారం అందుతోంది. అప్రమత్తమై ఎక్కడికక్కడ వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేస్తారు. పోలీసులు వెళ్లిపోయారనే సమాచారం అందగానే తిరిగి ప్రారంభిస్తారు.

**రీచ్ ఏర్పాటు చేయడం లేదు**

బొమ్మకల్ గ్రామ శివారులోని మానేరు ఇసుక కోసం రీచ్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. కానీ అధికారులు ఆ గ్రామ శివారులోని వాగులో రీచ్‌ను ఏర్పాటు చేయడం లేదు. ఇలా పరోక్షంగా ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.

**సుమారు వెయ్యి ట్రాక్టర్లు...**

బొమ్మకల్, దుర్శేడు, చేగుర్తి, ఇరుకుల్ల గ్రామాల్లో సుమారు వెయ్యి ట్రాక్టర్ల వరకు ఉన్నాయి. వీటి ద్వారా యజమానులు కరీంనగర్ పట్టణానికి, చొప్పదండి తదితర ప్రాంతాలకు తరలించి ఒక్కో ట్రిప్పునకు రూ.3,000 వరకు ఇంటి నిర్మాణ యజమానుల నుంచి వసూలు చేస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో వాహనంలో నాలుగు ట్రిప్పులు తరలిస్తుంటారు. ఒకో ట్రిప్పు ధర రూ.3000 చొప్పున నిత్యం రూ.12 వేల వరకు సంపాదిస్తున్నారు. డీజిల్, డ్రైవర్ జీతం, భత్యం సగానికి సగం తీసినా నిత్యం రూ.6000 వరకు అక్రమార్జన లభిస్తోంది.

**రోజూ పట్టుకుంటున్నాం**

వాగు సమీపంలో జేసీబీ పెట్టి కందకాలు తవ్వించాం. అయినా వాటిని రాత్రి వేళ పూడ్చివేశారు.

# చలికి వణుకు.. సౌర యంత్రం మూలకు!

జనగామ : విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోతున్నాయి.. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం కార్యాచరణ రూపొందించకపోవడంతో ప్రజా ధనం వృథాగా మారుతోంది. జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, కస్తూర్బా గాంధీ విద్యాలయం(కేజీబీవీ)లో లక్షలు వెచ్చించి నీటిని వేడిచేసే సౌర యంత్రం (సోలార్ వాటర్ హీటర్)ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలు పనిచేయకుండా నిరుపయోగంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6 నుంచి ఇంటర్ రెండో సంవత్సరం వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. దాదాపు 200 పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు. కేజీబీవీ విద్యార్థినుల కోసం 2017-18లో విద్యా సంవత్సరంలో సోలార్ వాటర్ హీటర్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల హీటర్ మరమ్మతుకు గురికావడంతో విద్యార్థినులకు చలికాలంలో చన్నీటి స్నానం తప్పడం లేదు. ప్రతి మూడు నెలలకోసారి విద్యార్థులకు అందించాల్సిన పరిశుభ్రత కిట్లతో పాటు ఇతర సామగ్రి అందించలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జఫర్‌గఢ్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో సోలార్ వాటర్ హీటర్ పనిచేయక దాదాపుగా ఏడాదిన్నర అవుతోంది. మరమ్మతు చేయాలని విద్యార్థులు కోరినా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. విద్యార్థులు చలి కాలంలో అనేక ఇబ్బందులు పడుతున్నా ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కేజీబీవీ ప్రత్యేకాధికారి స్వప్నను వివరణ కోరగా.. సోలార్ వాటర్ హీటర్ ఇటీవల మరమ్మతులకు గురైన విషయం గురించి జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించాం. పరిశుభ్రత కిట్లను అందించాలని కోరాం. త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు.

# సాంకేతిక సాగు.. లాభాలు బాగు

కరీంనగర్ : ఇజ్రాయెల్ దేశంలో సాంకేతిక వ్యవసాయ విధానాలు అవలంబించి మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. ఇక్కడితో పోలిస్తే వ్యవసాయ సాగు విధానం పూర్తిగా వైవిధ్యంగా ఉంటుంది. ఎక్కువగా ఉద్యాన పంటలే సాగు చేస్తారు. అక్కడి వ్యవసాయ విధానాన్ని అధ్యయనం చేయడానికి తెలంగాణ రాష్ట్రం నుంచి వ్యవసాయ అధికారులు, రైతులతో కూడిన 30 మంది బృందం గత వారంలో వెళ్లి వచ్చింది. వారిలో జిల్లా వ్యవసాయాధికారి వాసిరెడ్డి శ్రీధర్ ఒకరు. అక్కడి విశేషాలను ఆయన ఇలా పంచుకున్నారు.

**నీటిని పొదుపుగా వాడుతారు**

ఇజ్రాయెల్‌లో 80 శాతం ఎడారి, 20 శాతం మాత్రమే భూభాగం ఉంటుంది. 3,500 అడుగుల లోతులో నీటి లభ్యత ఉంటుంది. సముద్రపు నీటిని శుద్ధి చేసి తాగు నీటితో పాటు పరిశ్రమల అవసరాలకు వాడుతారు. వాటికి వినియోగించిన ఆ నీటినే తిరిగి శుద్ధి చేసి సాగుకు ఉపయోగిస్తారు. నీటి చెరువులు, కాలువలు కనిపించవు. అక్కడ ప్రత్యేకంగా వర్షకాలం ఉండదు. ఎండాకాలం, చలికాలం మాత్రమే ఉంటుంది. ఎక్కువగా బిందు సేద్యంపైనే సాగు ఆధారపడి ఉంటుంది. పెట్టుబడిలో 40 శాతం నీటి కోసం, 40 శాతం పంటల పరిరక్షణకు, 20 శాతం కూలీల కోసం ఖర్చు చేస్తారు. ఎడారి ప్రాంతంలో సైతం ఖర్జురా, అలీవ్ ఆయిల్ పంటలను సాగు చేస్తారు.

**మార్కెట్ ధర నిర్ణయించేది రైతులే**

పొలంలో పండిన పంటలను శుభ్రం చేయడంతో పాటు అక్కడే ప్యాకింగ్ చేస్తారు. వారు పండించిన పంటలకు ధరలను సైతం రైతులే నిర్ణయిస్తారు.

**రసాయన ఎరువుల వినియోగం తక్కువ**

పంటలపై పురుగు మందులను చాలా తక్కువ మోతాదులో పిచికారీ చేస్తారు. అవసరమైతే తప్ప అనవసరంగా రసాయన ఎరువుల జోలికి వెళ్లరు.

**పాల ఉత్పత్తి ఎక్కువే**

పాల ఉత్పత్తి ఎక్కువగా ఇచ్చే పాడి ఆవులు, గేదెలను పెంచుతారు. వాటి పెంపకంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. పాల ఉత్పత్తి సైతం చాలా ఎక్కువగా ఉంటుంది.

**కలుపునకు అవకాశమే లేదు**

వర్షాలు లేక నీటి కొరత మూలంగా డ్రిప్ ద్వారా మొక్కల అడుగు భాగంలో పడేట్లుగా ఏర్పాట్లు చేస్తారు. కలుపు మొక్కలు రాకుండా డ్రిప్ పైపులను భూమిలోపల నుంచి వేయించి మొక్క అడుగు భాగంలో నీటి చుక్కలు పడేట్లు ఏర్పాట్లు చేస్తారు. ఈ విధానం వల్ల కలుపు మొక్కలు ఉండే అవకాశం లేకుండా పోతుంది.

**సమష్టి వ్యవసాయ విధానం**

అధిక శాతం ఉమ్మడి వ్యవసాయం చేస్తారు. 300 మంది కలిసి ఒక కమతంలో సమష్టిగా పంటలు పండిస్తారు. స్థానికంగా కూలీల లభ్యత తక్కువగా ఉంటుంది. పాలస్తీనా, థాయ్‌లాండ్ నుంచి కూలీలను తీసుకొస్తారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి రాయితీలు, సహకారం ఉండదు. మధ్యవర్తుల ప్రమేయం కనిపించదు. ఎక్కువగా ప్రభుత్వం నుంచి భూమిని లీజుకు తీసుకొని వ్యవసాయం చేస్తారు.

**అక్కడ చీడపీడలపై యుద్ధమే!**

ఇజ్రాయెల్‌లో వ్యవసాయానికి ఎక్కువగా సాంకేతికతను వినియోగిస్తారు. దేశంలో ఐదు శాతం మంది మాత్రమే వ్యవసాయం చేస్తారు. నీటి పొదుపుతో పాటు మొక్కల మధ్యన అమర్చే కెమెరాలతో వాటికి పట్టే చీడలను సైతం ప్రారంభ దశలోనే గుర్తిస్తారు. వీటన్నింటిని మానిటరింగ్ చేయడానికి కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఉంటుంది. వారు ఎప్పటికప్పుడు రైతులను పంట చీడలపై అప్రమత్తం చేస్తారు. అక్కడ ప్రత్యక్షంగా చూసిన అనుభవాలను ఇక్కడి రైతులకు ఉపయోగించేలా ప్రయత్నిస్తాం.

వాసిరెడ్డి శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి

**ఉద్యానవన పంటలే అధికం**

ఎక్కువగా పాలిసెట్ వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తారు. నీటిని పొదుపుగా వాడే విధానం అవలంబిస్తూ ఉద్యానవన పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. వరి పంట కనిపించదు. మొక్కజొన్న, పత్తి పంటలు సైతం చాలా అరుదుగా వేస్తారు. ఎక్కువగా సిట్రస్ జాతి పండ్ల తోటల పెంపకం ఉంటుంది.

# అతివృష్టి.. అనావృష్టి

కరీంనగర్ : కురవాల్సిన సమయంలో ముఖం చాటేసిన వర్షాలు.. అవసరం లేని వేళలో కుంభవృష్టితో పంటలను దెబ్బతీస్తూ రైతులను కోలుకోకుండా చేస్తున్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు కాకుండా అతివృష్టి, లేదంటే అనావృష్టి కన్నీళ్లను మిగుల్చుతోంది. వర్షాకాలం మొదలై మూడు నెలలు కావస్తున్నా రైతులు సంతోషంగా లేరు. వానాకాలం ఆరంభంలో ముందుగా నాటిన విత్తనాలు వర్షాలు కురవక మొలకెత్తలేదు. రెండు మూడు సార్లు విత్తనాలు నాటాల్సి వచ్చింది. ఇక జులైలో 20 రోజుల పాటు ఏకధాటి వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇసుక మేటలతో



వందలాది ఎకరాల్లో నష్టం వాటిల్లింది. సాధారణం కంటే 168 మి.మీ. అధిక వర్షపాతం నమోదైంది. ఇక జూన్, ఆగస్టు నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షాపాతం నమోదవడం పంటలపై ప్రభావం చూపుతోంది. జూన్‌లో 6 రోజులు, ఆగస్టులో ఒక్కరోజు మాత్రమే వర్షం కురిసింది.

**రెండు విధాలా నష్టం**

జిల్లాలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 3,39,050 ఎకరాలు కాగా ఇప్పటిదాకా 2,70,890 ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగు చేశారు. జులైలో భారీ వర్షాలతో జిల్లాలోని 62 గ్రామాల్లో 2,658 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. ఆగస్టులో సాధారణం 100 మి.మీ.కు గాను కేవలం 10.7 మి.మీ.ల వర్షాపాతమే నమోదైంది. నీటి ఎద్దడితో పంటల ఎదుగుదల లోపించిందని రైతులు వాపోతున్నారు. మొగి పురుగు, ఆకు మచ్చ, ఇతర తెగుళ్లు సోకాయని ఆందోళన చెందుతున్నారు.

**పంటల ఎదుగుదల లేదు**

జుర్రు పరశురాములు, లింగంపల్లి

30 గుంటల్లో పత్తి, ఎకరంలో మొక్కజొన్న పంట వేస్తే వర్షాలు కురవక పంటలు ఎదుగుదల లేకపోగా మొగిపురుగు సోకింది. రెండుసార్లు పురుగు మందు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. పత్తి పంటకు బావి ద్వారా నీరు పారించుకుంటున్న. మూడెకరాల్లో వేసిన వరికి మొగిపురుగు, ఇతర కీటకాలు సోకగా ఆరబెట్టి మందు పిచికారీ చేశాం. ఇప్పటికే పెట్టుబడులు భారమయ్యాయి.

# వరద ముంచింది.. నాణ్యత ‘తేలింది’!



వరంగల్ : ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగడంతో అనేక వంతెనలు తెగిపోయాయి. చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచి ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన హైలెవల్ వంతెనలు కొద్ది రోజులకే ధ్వంసం కావడం విమర్శలకు తావిస్తోంది. నిర్మాణ సమయంలో గుత్తేదారుల నిర్లక్ష్యం, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.

**పట్టుమని ఐదేళ్లు కాకుండానే..**

భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం చలివాగుపై రాఘవరెడ్డిపేట–టేకుమట్ల గ్రామాల మధ్య 2018లో రూ.18 కోట్లతో నిర్మించిన వంతెన ఇది.. ఐదేళ్లు పూర్తికాకముందే వరదలో కొట్టుకుపోవడం నాణ్యత లోపాలకు అద్దం పడుతోంది. మందలోరిపల్లి, దుబ్యాల, ఎంపేడు, వెల్లంపల్లి, కుందనపల్లి, బండపల్లి, గుమ్మడవెల్లి, ఆరెపల్లి, రాఘవరెడ్డిపేట గ్రామాలతో పాటు, మొగుళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల రాకపోకలకు ఇదే ఆధారం. వంతెన మీదుగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట వెళ్తారు. ఇటీవల వంతెన కూలడంతో రాఘవరెడ్డిపేట నుంచి టేకుమట్ల వచ్చేందుకు వాగు దాటుతుండగా వరదల కారణంగా ఏర్పడిన గుంతలో పడి ఓ వృద్ధుడు మృతిచెందారు.

**అంచనా తప్పిందా..?**

వంతెనలు నిర్మించేటప్పుడు దాదాపు వందేళ్ల ప్రవాహాలను అంచనా వేస్తారు. ఇదేదీ లేకుండానే వీటిని నిర్మించారా? అనే సందేహం వ్యక్తమవుతోంది. గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, అప్పట్లో పనులను పర్యవేక్షించిన అధికారుల నిర్లక్ష్యం వల్లే వంతెనలు కూలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మరమ్మతులు ఎప్పుడో!**

భారీ వర్షాలకు పస్రా నుంచి మేడారం వెళ్లే ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. దాదాపు కిలో మీటరు మేర ఒకవైపు ఇదే పరిస్థితి నెలకొంది. నిత్యం మేడారం అమ్మవార్ల దర్శనానికి భక్తులు ఈ రోడ్డు గుండానే వెళతారు. రాత్రి వేళల్లో ప్రయాణం చేయాలంటే ఇబ్బందే. ఇప్పుడైనా సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**కుంగిపోయి..**

తాడ్వాయి మండలం వెంగ్లాపూర్–గోనెపల్లి గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన వంతెన ఇది. రూ.3.50 కోట్లతో 2000 సంవత్సరంలో పూర్తి చేశారు. ఇటీవల వచ్చిన వరదలకు వంతెన కుంగిపోవడంతో రాకపోకలు సాగించడానికి ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

**జంపన్న వాగుపై..**

ఏటూరునాగారం మండలం దొడ్ల–మల్యాల గ్రామాల మధ్య జంపన్న వాగుపై నిర్మించిన వంతెన ఇలా దర్శనమిస్తోంది. ఐఏపీ నిధులు రూ.5 కోట్లతో నిర్మించి 2015 డిసెంబరులో ప్రారంభించారు. ఎనిమిదేళ్లకే కుప్పకూలడం విస్మయానికి గురి చేస్తోంది. మల్యాల, కొండాయి, ఐలాపూర్ గ్రామాలకు పూర్తిగా రవాణా స్తంభించింది. ఇదే రోడ్డు మార్గాన మేడారం జాతర సమయంలో ఖమ్మం, భద్రాచలం జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు.

**కూలిపోయిన వంతెన...**

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామ శివారులోని రాఘవపట్నం గ్రామానికి వెళ్లే వంతెన కూలిపోయింది. దీంతో కొన్ని రోజులుగా మేడారానికి రాకపోకలు నిలిచిపోయాయి. పస్రా మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది– ముష్కె శివ, ఆరెపల్లి**

నేను ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. రోజూ మా ఊరి నుంచి టేకుమట్ల మండల కేంద్రానికి వెళ్తుంటాను. మా గ్రామం నుంచి టేకుమట్లకు 3 కి.మీ. ఉంటుంది. వంతెన కూలిపోవడంతో మొగుళ్లపల్లి, చిట్యాల మండల కేంద్రాల మీదుగా దాదాపు 30 కి.మీ. తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దూర భారంతో పాటు సమయం వృథా అవుతోంది. రవాణాకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

**ఊరు మునిగింది..–కాక వెంకన్న, కొండాయి సర్పంచి**

ఇటీవల వచ్చిన వరదలకు జంపన్న వాగు ఉప్పొంగి మా ఊరు మునిగింది. 8 మంది చనిపోయారు. వాగుపై ఉన్న వంతెన కూలింది. కొండాయి నుంచి ఏటూరునాగారం రావాలంటే మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోట్‌లు, తెప్పల సాయంతో వాగు దాటుతున్నాం. వరదలు తగ్గి ఇన్ని రోజులు గడుస్తున్నా వంతెన మరమ్మతులు చేయడం లేదు.

**అధిక ప్రవాహమే కారణం– వెంకటేశ్, ఆర్అండ్‌బీ ఈఈ**

ఎప్పుడూ లేని విధంగా అధిక వర్షాలు కురిశాయి. అంచనా వేసిన దానికంటే ఎక్కువ వరద రావడంతో వంతెనలు దెబ్బతిన్నాయి. తాత్కాలికంగా కొన్ని చోట్ల మరమ్మతు చేపట్టాం. కూలిపోయిన వంతెనలకు ప్రతిపాదనలకు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

# పుర ప్రజల సేవలకు ‘వార్డు అధికారులు




వరంగల్ : పట్టణ ప్రజల సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా వార్డు స్థాయిలోనే అన్ని సేవలు అందించేందుకు అడుగులు వేస్తోంది. క్షేత్రస్థాయిలో వార్డుల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అందడం లేదనే కారణంతోనే ఉన్నతాధికారులు ఈ విధానానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే వీఆర్‌ఏలను పలు శాఖలకు సర్దుబాటు చేయగా, అందులో కొందరిని పురపాలక సంఘాలకు వార్డు అధికారులుగా నియమించారు. త్వరలోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి సైతం వార్డు అధికారులను మున్సిపాలిటీల్లో నియమించనుండటంతో.. మున్ముందు పట్టణ పాలన మరింత పటిష్ఠం కానుంది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కార్పొరేటర్ ఉన్న చోట ప్రతి డివిజన్‌లో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసి, అక్కడే అన్ని రకాల అర్జీలను స్వీకరిస్తూ.. సత్వరమే పరిష్కరిస్తున్నారు. ఇదే పద్ధతిని అన్ని పురపాలికల్లో అమలు చేయడంలో భాగంగా వార్డు అధికారుల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

మరింత చేరువగా..వీధి దీపాలు పాడవడం, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పెరిగి పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడం, రోడ్లపై గుంతలు తదితర సమస్యలపై ఫిర్యాదు కోసం మున్సిపాలిటీకి వెళ్లాల్సిందే. పట్టణ విస్తీర్ణం అధికంగా ఉండటంతో.. ప్రజలు పుర కార్యాలయానికి వెళ్లలేకపోతున్నారు. ఉదాహరణకు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లి శివారు బెడ్డలపల్లి, చల్లూరుపల్లి, పుల్లూరిరామయ్యపల్లి గ్రామ శివారు గంద్రపల్లి, మహబూబ్‌పల్లి గ్రామాలు మున్సిపాలిటీ కార్యాలయానికి ఆరు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సమస్యలు ఎదురైనా వెళ్లకపోవడంతో.. చాలా వరకు పరిష్కారం కావడం లేదు. వీటిని నివారించేందుకే ప్రభుత్వం వార్డు అధికారులను నియమిస్తోంది. 2022 పట్టణ ప్రగతిలో వార్డుల వారీగా మున్సిపాలిటీలో ఉన్న సిబ్బందిని వార్డు అధికారి పేరుతో నియమించినా.. ఫలితాలు అంతంత మాత్రంగానే వచ్చాయి. తాజాగా వార్డు అధికారి పోస్టుతోనే ప్రభుత్వ ఉద్యోగులు రానుండటంతో సేవలు మెరుగుపడనున్నాయి.

**సమస్యల పరిష్కారానికి..**

అక్రమ కట్టడాల కూల్చివేతలు, రోడ్లపైన గుంతలు పూడ్చడం, మురుగు తొలగించడం, పైపుల్లో పేరుకుపోయిన చెత్తను తీసివేయడం, పశువుల కళేబరాల తొలగింపు తదితర పనులన్నీ ఇక్కడి నుంచే చేపట్టనున్నారు. పారిశుద్ధ్య సిబ్బందిని వీరికి అనుసంధానం చేసి ఇతర చోటికి వెళ్లాల్సిన అవసరం లేకుండా చేస్తారు. దివ్యాంగుల సంక్షేమానికి కూడా సేవలందిస్తారు. జనన, మరణ ధ్రువపత్రాలు వార్డులోనే అందించనున్నారు. ఆస్తి పన్ను వసూలు బాధ్యతను నిర్వర్తిస్తారు. ఆక్రమణల ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా వీరిదే.

**వార్డు పరిధిలో కార్యాలయం**

భవిష్యత్తులో వార్డు అధికారికి అదే వార్డు పరిధిలో కార్యాలయాన్ని నిర్మించనున్నారు. అక్కడే కౌన్సిలర్‌కు కూడా ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టనున్నట్లు స్థానిక మున్సిపల్ అధికారి ఒకరు ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. ఈ విధానం కొంతకాలం తర్వాత అమలు చేయనున్నారు. భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలో మొత్తం 30 వార్డులుండగా, కొన్ని నెలల క్రితం తొమ్మిది మంది వీఆర్‌వోలు బదిలీపై రాగా, ఇటీవల ఇద్దరిని కేటాయించారు. మొత్తం 11 మందిని వార్డు అధికారులుగా నియమించనున్నారు. మిగతా 19 వార్డులకు టీఎస్‌పీఎస్‌సీ నుంచి నియమించే అవకాశం ఉంది.

# జోరందుకున్న ఆయిల్‌పామ్ సాగు

జగిత్యాల : వరికి బదులు ఆయిల్‌పామ్ సాగుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించి ఈ సీజనుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టారు. గత సంవత్సరం నుంచి నాలుగేళ్లపాటు ఉమ్మడి జిల్లాలో 1.31 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను నాటాలని నిర్ణయించగా ఆయిల్‌ఫెడ్ నుంచి అనుమతులు పొందిన కంపెనీలు విదేశాల నుంచి విత్తనాలను తెప్పించి ఆయా జిల్లాల్లో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలకు పెంచాయి. 2022 ఫిబ్రవరి నుంచి మార్చి నెలాఖరు వరకు 13,200 ఎకరాల్లో ఆయిల్‌పామ్ నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా 4,664 ఎకరాల్లో మొక్కలను నాటారు. గతంలో డీడీలు ఇచ్చిన రైతులతో పాటుగా నూతనంగా దరఖాస్తు చేసినవారి తోటల్లో మొక్కలు నాటుతున్నారు. ప్రస్తుత వానాకాలం నుంచి 2024 మార్చివరకు ఉమ్మడి జిల్లాలో 45,800 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటికే 4,863 ఎకరాల్లో మొక్కలు నాటారు. బిందుసేద్య పరికరాలు, మొక్కలకు తమవంతు వాటా డీడీలు తీసిచ్చిన రైతులకు మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఉద్యాన, వ్యవసాయశాఖల అధికారులు జె.ప్రతాప్‌సింగ్, పి.సురేశ్‌కుమార్ పేర్కొన్నారు.

**క్రషింగ్ యూనిట్ ఏర్పాటు అవసరం**

ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే గానుగ(క్రషింగ్ ద్వారా నూనెతీసే) పరిశ్రమలున్నాయి. జిల్లాలో నిరుటి నుంచి మొక్కలు నాటుతుండగా వచ్చే సంవత్సరం పంట దిగుబడి మొదలవుతుంది. కాబట్టి ఉమ్మడి జిల్లాలోనే క్రషింగ్ యూనిట్ నిర్మాణం చేపడితే పంట మార్కెట్కు వచ్చేసరికి సిద్ధమవుతుంది. స్థానికంగా క్రషింగ్ పరిశ్రమ ఏర్పాటవుతేనే మిగిలిన రైతులకు భరోసా కలిగి ఆయిల్‌పామ్‌వైపు రైతులు పెద్దఎత్తున మళ్లే అవకాశముంది. మొక్కలు నాటి కొన్నేళ్లు పెంచిన తరువాత గెలల అమ్మకంలో ఇబ్బంది, ధరలో తగ్గుదల రాకుండా ప్రభుత్వం మధ్యవర్తిత్వంతో కంపెనీలతో దీర్ఘకాలిక ఒప్పంద చర్యలుండాలి. ప్రభుత్వ ప్రోత్సాహంగా ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్, మొక్కలు, నిర్వహణ ఖర్చు తదితరాలకు హెక్టారుకు రూ.50 వేల వరకు రాయితీని నాలుగేళ్లలో అందిస్తున్నారు. మనప్రాంత రైతులకు సాగుఅనుభవంలేని పంటకాబట్టి భారత ఆయిల్‌పామ్ పరిశోధనసంస్థ, ఆంధ్రప్రదేశ్ పెదవేగి ఆయిల్‌పామ్ పరిశోధనస్థానం, ప్రైవేటు కంపెనీల శాస్త్రవేత్తలు, ఉద్యాన, వ్యవసాయశాఖల అధికారులు రైతుల తోటలను ఎప్పటికప్పుడు సందర్శించి పురుగులు, తెగుళ్ల నిరోధం, మొక్కల ఎదుగుదలను, అంతరపంటల సాగును వివరించాలి.

**పంట రుణంతో మరింత ప్రోత్సాహం**

ధాన్యం విక్రయంలో సమస్యలు, మామిడిలో చీడపీడలు, ఇతర పంటల సాగులోనూ వన్యప్రాణుల బెడద, కూలీల కొరత, ఉత్పత్తుల విక్రయ సమస్యలు తదితరాలతో ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తిగా ఉండగా ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రైవేటు కంపెనీలు ముందుకు సాగుతున్నాయి. ఆయిల్‌పామ్‌కు వన్యప్రాణులు, కోతుల బెడద లేకపోవటం, చీడపీడల సమస్య అరుదుగా ఉండటం, కంపెనీల బైబ్యాక్ కాబట్టి గెలల మార్కెటింగ్ ఇబ్బంది లేకపోవటం తదితర సానుకూలతలతో ఆయిల్‌పామ్‌ను ప్రత్యామ్నాయ పంటగా రైతులు భావిస్తుండగా వీరి నమ్మకం నిలిచేలా ప్రభుత్వం దీర్ఘకాలికంగా అండగా నిలవాలి. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన 5 ఏళ్ల నుంచి ఎకరాకు రూ.40,000 నుంచి రూ.42,000 వరకు పంట రుణాన్ని ఇస్తుండగా ఐదేళ్ల నుంచి కాకుండా తొలి సంవత్సరం నుంచే ఆయిల్‌పామ్ రైతులకు పంట రుణాన్ని మంజూరిస్తే రైతులకు ఆర్థికంగా వెసులుబాటుగా ఉంటుంది. ఇదే తరుణంలో పంటల బీమాను కూడా చేయటం ద్వారా రైతులకు భరోసాగా ఉంటుంది.

# నిర్మాణ లోపాలు.. నిధులు నీళ్లపాలు

పెద్దపల్లి : వరద పోటెత్తితే వాన నీటిని ఒడిసిపట్టే ఆనకట్టలు కొట్టుకుపోతున్నాయి. భారీ వర్షాలకు వాగులకు ప్రవాహం పెరిగి చెక్‌డ్యాంలు ధ్వంసమవుతున్నాయి. పంటలకు సమృద్ధిగా నీరందించడంతో పాటు భూగర్భ జలాలను పెంచాలన్న లక్ష్యంతో జిల్లాలోని వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచ, చలి, పెద్దవాగులకు వరద పోటెత్తి మంథని మండలంలోని మానేరు వాగులో కలిసింది. దీంతో శివారులోని అడవిసోమన్‌పల్లి చెక్‌డ్యాం కుప్పకూలింది. మరోవైపు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ వద్ద మానేరు పరీవాహకంలో నిర్మించిన ఆనకట్ట వరదలకు కొట్టుకుపోయింది. జిల్లాలో మొత్తం రూ.234 కోట్లతో మానేరు వాగుపై 16, హుస్సేన్‌మియా వాగుపై 5 కలిపి మొత్తం 21 చెక్‌డ్యాంలు నిర్మించారు. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు ప్రాంతాలైన కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్, ముత్తారం, మంథని మండలాల్లో చెక్‌డ్యాంలు నిర్మించేందుకు 2019 నుంచి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. వీటిలో కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకోగా నాణ్యత, నిర్మాణ లోపాల వల్ల గతేడాది వరదలకు కొట్టుకుపోయాయి. అనుభవం లేని గుత్తేదారు సంస్థలకు ఒకటి కంటే ఎక్కువ ఆనకట్టల నిర్మాణ బాధ్యతలు కట్టబెట్టడం వల్ల నాణ్యత ప్రశ్నార్థకమవుతోంది. నిర్మాణ దశలోనే కూలిపోవడం, కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. నాసిరకం ఇసుక, కంకర, సిమెంటు వాడుతున్నారన్న ఆరోపణలున్నాయి.

**అంచనాలే తప్ప శాశ్వత పరిష్కారమేదీ!**

ఆనకట్టల నిర్మాణంలో భాగంగా ముందుగా వాగులో గట్టిదనం వచ్చేవరకు ఇసుకను పూర్తిగా తోడి బెడ్ నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఇసుకపైనే పునాది వేయడంతో చెక్‌డ్యాం కింద నీటిని ఎత్తిపోసేందుకు నిర్మించిన ఆప్రాన్‌లు, రిటైనింగ్ వాల్స్, అబార్డ్‌మెంట్ భాగాలు వరద ఉద్ధృతికి దెబ్బతింటున్నాయి.

వరద ఉద్ధృతిని అంచనా వేసేందుకు ప్రత్యేకంగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోయింది. ఇసుక మేటలు పూర్తిగా తొలగించకుండానే ఆనకట్టలు నిర్మించడంతో దెబ్బతింటున్నాయని పరీవాహక ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం క్షేత్ర స్థాయికి వచ్చి నష్టాన్ని పరిశీలించి వెళ్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపెట్టడం లేదనే విమర్శలున్నాయి.

అడవిసోమన్‌పల్లి వద్ద మానేరులో చెక్‌డ్యాం నిర్మాణం ఇటీవలి భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. రూ.16 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ చెక్‌డ్యాం రిటైనింగ్ వాల్స్ దెబ్బతినడంతో పరీవాహక రైతుల పొలాలు నీటమునిగాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 23 ప్రధాన చెరువులతో పాటు మోరంచ, చలి, పెద్దవాగుల నుంచి భారీగా వరద రావడంతో ఈ ఆనకట్ట దెబ్బతింది. మరోవైపు కరీంనగర్ వద్ద ఎల్ఎండీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో ఉద్ధృతి మరింత పెరిగింది. వరదల మూలంగా ఈ ఆనకట్టకు రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లిందని నీటిపారుదల శాఖ ఏఈ తిరుపతి పేర్కొన్నారు.

# ఈసారి చెక్కు చెదరకూడదని..

ఖమ్మం : ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు చెక్కుల రూపంలో పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలో బోనకల్లు, మధిర, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, వైరా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం, అశ్వాపురం, పినపాక, గుండాల, చర్ల తదితర మండలాల్లో ఉద్యాన, వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మొక్కజొన్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కంకులను కోసే సమయంలో పంట నేలకొరిగింది.
వర్షానికి మిర్చి పంట తడవటంతో అన్నదాతలు నష్టపోయారు. ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ మార్చి 21న పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ప్రకటించారు.ప్రజాప్రతినిధుల ద్వారా అందించాలని..ఈఏడాది అకాల వర్షాలతో రెండు దశల్లో పంటలను రైతులు నష్టపోయారు. మొదటి దశలో (మార్చి 16 నుంచి 21 వరకు) నష్టపోయిన రైతులకు పరిహారం



సొమ్ము నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమైంది. దీనిద్వారా ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదని అధికార పార్టీ ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండో దశ (మార్చి 22 నుంచి ఏప్రిల్ 21 వరకు)లో జరిగిన పంట నష్టానికి సంబంధించిన పరిహారాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా చెక్కుల రూపేణా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
మొదటి విడత పరిహారంమార్చి 16 నుంచి 21 వరకు కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయశాఖ సేకరించి ప్రభుత్వానికి నివేదించింది. మొదటి విడత కింద ఏప్రిల్‌లో ప్రభుత్వం పరిహారం నిధులు మంజూరు చేసింది.

# అతిథి గృహంపై అంతర్గత వివాదం



ఖమ్మం : ఖమ్మం బైపాస్ రోడ్ ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో రెండెకరాల విస్తీర్ణంలో నాలుగున్నర దశాబ్దాల కిందట నిర్మించిన ఎన్నెస్పీ అతిథి గృహం ఎవరిదనే అంశంపై రెండు ప్రభుత్వ శాఖల మధ్య వివాదం తలెత్తింది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఈ ప్రాంతంలో చదరపు గజం రూ.లక్ష ధర పలుకుతోంది. రెండు ఎకరాల విస్తీర్ణంలోని అతిథి గృహం అంటే ప్రభుత్వ ఆస్తి విలువ సుమారు రూ.90 కోట్ల వరకు ఉంటుంది. జలవనరుల శాఖ, రెవెన్యూ శాఖల మధ్య దీని కోసం అంతర్గతంగా వివాదం నెలకొంది.
నేపథ్యం ఇదీ....
జిల్లాలో సాగర్ ఎడమ కాల్వల తవ్వకం సమయంలో 1976 ఆగస్టు 27న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఖమ్మంలో ఇల్లెందు రోడ్ వెంట అతిథి గృహం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1979 సెప్టెంబోర్ 10న అప్పటి ఎన్నెస్పీ చీఫ్ ఇంజినీర్ ఎం.రహమతుల్లాఖాన్ ప్రారంభించారు. అప్పటి నుంచి 2003 వరకు జలవనరుల శాఖలోని ఎన్నెస్పీ విభాగం స్వాధీనంలో ఉండేది. 2003 మే 31న అప్పటి కలెక్టర్ అరవింద్‌కుమార్ ఎన్నెస్పీ అతిథి గృహాన్ని డీఆర్వో(జిల్లా రెవెన్యూ అధికారి) కంట్రోల్‌కు మార్చుచూ రెవెన్యూ శాఖకు అప్పగించారు. అనంతరం ఆఫీసర్స్ అతిథి గృహంగా పేరు మార్చారు. అప్పటి నుంచి రెవెన్యూ శాఖ దీన్ని నిర్వహిస్తోంది.
జలవనరుల శాఖకు అప్పగించాలని కలెక్టర్‌కు లేఖ
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం నీటి పారుదల రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. భారీ, మధ్య తరహా, చిన్న నీటిపారుదల, ఐడీసీ, ఎత్తిపోతల పథకాల వంటి వేర్వేరు విభాగాలను ఒకే గొడుగు కిందకు చేర్చి జలవనరుల శాఖను ఏకీకృతం చేసింది. జిల్లాకు జలవనరుల శాఖ అధికారుల బృందాలు తరచుగా వస్తున్నాయి. వారికి విడిది కోసం అతిథి గృహం లేనందున హోటళ్లలో బస ఏర్పాటు చేస్తున్నారు. సమీక్ష సమావేశాలకు ఇబ్బందిగా ఉంది. 2022 నవంబర్ 7న జలవనరుల శాఖ ఈఎన్‌సీ మురళీధరరావు ఖమ్మంలోని ఎన్నెస్పీ గెస్ట్ హౌస్‌ను తమ శాఖకు అప్పగించాలని కలెక్టర్‌కు లేఖ రాశారు. అనంతరం ఆ శాఖ కార్యదర్శి రజత్‌కుమార్ 2022 డిసెంబర్ 6న కలెక్టర్‌కు మరో లేఖ రాశారు. గతంలో అతిథి గృహాన్ని ఏకపక్షంగా తీసుకున్నారని, ప్రభుత్వ అనుమతులు లేవని, తమ శాఖకు చెందింది కావడంతో తిరిగి స్వాధీనపరచాలని కలెక్టర్‌కు లేఖ రాశారు.ఈ విషయంపై జలనవరులశాఖ అధికారులు ఇటీవల కలెక్టర్‌ను సంప్రదించగా తాము నిర్వహించిన కాలంలో రూ.7కోట్లు వెచ్చించామని, ఆడబ్బు రెవెన్యూ శాఖకు చెల్లిస్తే అతిథిగృహాన్ని ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని జిల్లా జలవనరుల శాఖ అధికారులు తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఎన్నెస్పీ అతిథిగృహం కోసం రెండుశాఖల అధికారులు పట్టుబట్టడం గమనార్హం.

# ప్చ.. 9 నెలలకు రూ.18 వేలు

ఖమ్మం : కిన్నెరసానికి ప్రత్యేక గుర్తింపు తెస్తుందని భావించిన 'సావనీర్ కేంద్రం' నిరాశే మిగిల్చింది. సాధారణ రోజుల్లో 200 నుంచి 300 మంది, ప్రత్యేక సందర్భాల్లో 600 నుంచి 800 మంది వరకు సందర్శకులు పర్యాటక కేంద్రానికి తరలివస్తుంటారు. కానీ, స్థానిక విశిష్టతలతో తయారుచేసిన వస్తువులను వారితో కొనుగోలు చేసేలా ఆకట్టుకోవడంలో నిర్వాహకులు విఫలమవుతున్నారు. కేంద్రాన్ని ప్రారంభించిన దగ్గర్నుంచి కేవలం రూ.18 వేల వ్యాపారం మాత్రమే జరగడం గమనార్హం.కిన్నెరసాని పర్యాటక కేంద్రాన్ని సందర్శించే పర్యాటకులకు మధుర జ్ఞాపకాలను అందించే ఉద్దేశంతో అటవీ శాఖాధికారులు 'సావనీర్' కేంద్రాన్ని నవంబరు 18, 2022న ప్రారంభించారు. పర్యాటక కేంద్రం విశిష్టతలు, వన్యప్రాణుల చిత్రాలతో ముద్రించిన బ్యాగులు, క్యాప్‌లు, కీచైన్లు, టీకప్పులు, టీషర్టులు, బాటిళ్లు విక్రయించడం ప్రారంభించారు. ఇవన్నీ టోల్‌గేటు ఎదురుగా ప్రత్యేకంగా ఓ దుకాణంలో లభిస్తాయి. అధికారులు ఆశించినంత మాత్రం విక్రయాలు జరగడం లేదు. అన్ని రకాల సామగ్రి వంద చొప్పున రూ.80 వేల వరకు వెచ్చించి తీసుకొచ్చారు. కేంద్రాన్ని ప్రారంభించి తొమ్మిది నెలలు గడుస్తుండగా.. రూ.18 వేల సరుకు మాత్రమే విక్రయించారు.
అధికాదాయంపై దృష్టిపెడితే మేలు
సావనీర్ కేంద్రం ద్వారా అధికాదాయాన్ని సమకూర్చుకుంటే... పర్యాటకులకు మరిన్ని వసతులు కల్పించవచ్చనే వాదన ఉంది. ఈ కేంద్రం నిర్వహణను అద్దె ప్రాతిపదికన వేలంపై కేటాయిస్తే మరింత లాభం కలుగుతుందన్న అభిప్రాయం అటవీశాఖ సిబ్బంది, పర్యాటకుల్లో వ్యక్తం అవుతోంది. కనీసం నెలకు రూ.15 వేల వరకైనా అద్దె వచ్చే అవకాశం ఉందని ఓ అధికారి అభిప్రాయపడ్డారు.

# ట్రాఫిక్ రద్దీ.. పట్టదా ఎవరికీ?

వరంగల్ : వరంగల్ వెంకట్రామ కూడలిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కూడలి నుంచి నర్సంపేట, మహబూబాబాద్, ఖమ్మం వైపు బస్సులు, లారీలు, వ్యాన్లు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో వెళ్తుంటాయి. వేకువ జామున 4 నుంచి రాత్రి 10 గంటల వరకు కూడా వాహనాల రద్దీ ఉంటుంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఐదేళ్లలో జరిగిన ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. ఉదయం వేళలో కూరగాయల విక్రయాల కోసం వచ్చిపోయే వారితో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు ఇదే కూడలిలో పలు ఆసుపత్రులు ఉండడం వల్ల వివిధ గ్రామాల నుంచి వచ్చే రోగులతో కూడా ఈ ప్రాంతం రద్దీగా ఉంటోంది. ఇక్కడే సినిమా



థియేటర్ కూడా ఉండటంతో సినిమా వదిలే సమయంలో ఒక్కసారిగా వాహనాలు రోడ్డుపైకి వచ్చి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.
నాలుగు వైపులా ఇరుకు..: వెంకట్రామ కూడలిలో నాలుగు వైపులా ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. బస్సు స్టేషన్ మార్గం మలుపు వద్ద హోటల్, పలు దుకాణాలు ఉన్నాయి. సినిమా థియేటర్ వైపు బస్ షెల్టర్ ముందుకు చొచ్చుకు వచ్చింది. ఈ కారణంగా ఆ వైపుల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. నర్సంపేట వైపు నుంచి వచ్చే మార్గం మలుపు వద్ద, కూరగాయలు, పండ్ల విక్రయ కేంద్రాలకు వెళ్లే మార్గం మలుపు వద్దా వాహనాల రద్దీ ఉంటోంది. ఈ కూడలిలో రాత్రివేళ విద్యుత్తు దీపాలు కూడా సరిగా వెలగడం లేదు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా పనిచేయడం లేదు. ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఏం జరిగినా తెలిసే పరిస్థితి లేదు. ట్రాఫిక్ పోలీసులు ఈ కూడలిపై ప్రత్యేక దృష్టి సారించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది.

# నాలాల విస్తరణకు శ్రీకారం

వరంగల్ : ఓరుగల్లులోని త్రినగరాల్లో ప్రధానమైన నాలాల విస్తరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. 2020 అక్టోబరులో నీటిపారుదల శాఖ సాంకేతిక కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం క్షేత్రస్థాయిలో నాలాలకు మార్కింగ్ ఖరారు చేస్తున్నారు. ఐదు రోజుల క్రితం వరంగల్, హనుమకొండ జిల్లాల పాలనాధికారులు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్, గ్రేటర్ వరంగల్ కమిషనర్ రిజ్వాన్ బాషా అంతర్గత సమావేశం నిర్వహించారు. ఆరు నాలాలు విస్తరించేందుకు ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో మార్కింగ్ చేస్తున్నారు.
ఆరు ఇవే..: హనుమకొండ వడ్డేపల్లి చెరువు మత్తడి నుంచి జవహర్‌నగర్ వరకు నాలా సుమారు 2 కి.మీటర్లు ఉంటుంది. ప్రస్తుతం 30 నుంచి 40 అడుగుల విస్తీర్ణం ఉండగా.. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 66 అడుగులకు విస్తరించాలని నిర్ణయించి, ఇప్పటికే మార్కింగ్ ఖరారు చేశారు. సమ్మయ్యనగర్, రాజాజీనగర్, నయీంనగన్, బొక్కలగడ్డ ఈద్గా, పెగడపల్లి డబ్బాలు మీదుగా కెనాల్ టన్నెల్ వరకు నాలా 3 కి.మీటర్ల పొడవుంది. ప్రస్తుతం 30 నుంచి 40 అడుగుల మేర విస్తీర్ణం ఉండగా.. 82 అడుగులకు విస్తరించనున్నారు. హనుమకొండ అలంకార్ పెద్దమోరీ నుంచి కాకతీయ కాలనీ, పెద్దమ్మగడ్డ రోడ్డు మీదుగా కెనాల్ టన్నెల్ వరకు కిలోమీటరు ఉన్న నాలాను 30 అడుగుల నుంచి 100 అడుగులకు విస్తరించేందుకు ప్రతిపాదించారు. వరంగల్ కాకతీయ మ్యాజికల్ గార్డెన్ నుంచి సరస్వతి కాలనీ, రంగంపేట, ములుగు రోడ్డు మీదుగా అలంకార్ పెద్దమోరీ వరకు 1.50 కి.మీటర్ల మేర 40 అడుగుల విస్తీర్ణంలో ఉన్న నాలాను 82 అడుగులకు విస్తరించేందుకు ఖరారు చేశారు.
హంటర్ రోడ్డు బొందివాగు నుంచి గాయత్రిగుడి, ఎన్టీఆర్‌నగర్, పోతననగర్ వరకు నాలా ఒక కిలోమీటరు వరకు ఉంటుంది. ప్రస్తుతం 40 అడుగులు ఉన్న నాలాను 120 అడుగులకు విస్తరించేందుకు ప్రతిపాదించారు. ఉర్సుచెరువు మత్తడి నాలా బీఆర్‌నగర్ నుంచి ఉర్సుగుట్ట మీదుగా బొందివాగు రైల్వేట్రాక్ వరకు సుమారు కిలో మీటరు ఉంటుంది. ప్రస్తుతం 20 నుంచి 25 అడుగుల విస్తీర్ణం ఉండగా.. 120 అడుగులకు విస్తరించనున్నారు.
ఆక్రమణల కూల్చివేత నాలాల ఆక్రమణల తొలగింపు మొదలైంది. హనుమకొండ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆదేశాల మేరకు గ్రేటర్ అధికారులు, నీటిపారుదల, రెవెన్యూ, పోలీసు శాఖాధికారుల పర్యవేక్షణలో నయీంనగర్, జవహర్‌నగర్ నాలాల వద్ద తాత్కాలిక షెడ్లు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, చిన్నచిన్న నిర్మాణాలను కూల్చేశారు. క్షేత్రస్థాయిలో మార్కింగ్ ఇచ్చిన దగ్గర వెంట వెంటేనే ప్రొక్లెయినర్ల సాయంతో నిర్మాణాలు తొలగించారు. నయీంనగర్ ప్రధాన రహదారి నుంచి సీడీసీ కళాశాల, బొక్కలగడ్డ దగ్గర, జవహర్‌నగర్‌లో కూల్చివేతలు కొనసాగాయి. వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్ సాయంత్రం జవహనగర్ నాలా వద్ద కూల్చివేతలను పరిశీలించారు. భద్రకాళి నాలా మార్కింగ్: వరంగల్ ప్రాంతంలో కీలకమైన భద్రకాళి నాలా మార్కింగ్ మొదలైంది. నీటిపారుదల శాఖ సాంకేతిక కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం కేఎంజీ పార్కు నుంచి సరస్వతి కాలనీ, రంగంపేట, ములుగు రోడ్ మీదుగా అలంకార్ పెద్దమోరీ వరకు 82 అడుగులు నాలా విస్తరణకు మార్కింగ్ చేశారు. సరస్వతినగర్‌లో ఓ ఇంటికి ఇచ్చిన మార్కింగ్‌పై మహిళ అభ్యంతరం వ్యక్తం చేశారు. మూడేళ్ల క్రితం నాలా విస్తరణ పేరుతో గోడలు కూల్చేశారని, ఇంత వరకు శాశ్వత పనులు చేపట్టలేదన్నారు.

# సింగరేణి నీటి రాయల్టీ రూ.3కోట్లు




ఖమ్మం : సింగరేణిపై ఐ అండ్ క్యాడ్(ఇరిగేషన్) శాఖ మూడు కోట్ల రూపాయల నీటి రాయల్టీ విధించింది. దీంతో మణుగూరు ఏరియా నుంచి నీటి రాయల్టీని సింగరేణి చెల్లించనుంది. గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమలు గోదావరి నీటిని వినియోగించినందుకు ఇరిగేషన్ శాఖకు రాయల్టీని చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 2012 నుంచి బకాయి ఉన్న రూ.3.35 కోట్ల రాయల్టీని చెల్లించాలని ఇరిగేషన్ శాఖ సింగరేణికి తాఖీదులు పంపింది. ఒక్కసారిగా రూ.3 కోట్ల పైబడి రాయల్టీ చెల్లించాల్సి ఉండటంతో సింగరేణిపై భారం పడనుంది.
రాయల్టీ విధింపులో తేడాలు
గోదావరి నీటిని ఏవిధంగా వినియోగిస్తున్నారనే అంశంపై రాయల్టీ విధింపు ఉంటుంది. నీటి వినియోగంలో డొమెస్టిక్, పరిశ్రమలకు రాయల్టీ వేర్వేరుగా ఉంటుంది. అయితే సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో గోదావరి నీటిని వినియోగించుకున్నందుకు 2012 వరకు పరిశ్రమలు, డొమెస్టిక్ వినియోగంలో భాగంగా వేర్వేరుగా రాయల్టీ చెల్లించింది. అయితే మణుగూరులో సింగరేణి సంస్థ నీటిని బొగ్గు గనుల్లో వినియోగించడం లేదు. కేవలం డొమెస్టిక్ విధానంలో నీటిని వినియోగిస్తుంది. కార్మికవాడలతోపాటు పురపాలకం, చుట్టు పక్కల ఉన్న పంచాయతీలకు తాగు నీటిని సరఫరా చేస్తుంది. కానీ పరిశ్రమలకు వినియోగించే నీటి రాయల్టీని సింగరేణి చెల్లించాలని ఇరిగేషన్ శాఖ కోరుతుంది.
మినహాయింపు తిరస్కరణ
గోదావరి నీటిని ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర శాఖలు ప్రజావసరాలకు వినియోగిస్తే రాయల్టీ ఉండదు. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా రాయల్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతుంది. గృహావసరాలకు మాత్రమే నీటిని వినియోగిస్తున్నందున రాయల్టీ విధించొద్దని ఇరిగేషన్ శాఖను కోరుతుంది. కానీ మినహాయింపు ఇవ్వకపోగా, పర్రిశమలకు చెందిన రాయల్టీని విధించారు. కనీసం డొమెస్టిక్ విధానంలో రాయల్టీని విధించాలని కోరుతున్నా ఇరిగేషన్ శాఖ పట్టించుకోవటం లేదు.
రామగుండంలో మరోలా..గోదావరి నీటిని సింగరేణి సంస్థ ఒక్క మణుగూరులోనే కాకుండా రామగుండంలో కూడా వినియోగిస్తుంది. అయితే రామగుండంలో మాత్రం డొమెస్టిక్ విధానంలో రాయల్టీ విధించారు. మణుగూరులో మాత్రం పరిశ్రమల రాయల్టీని ఇరిగేషన్ శాఖ విధించింది. రెండు చోట్ల గోదావరి నీటిని డెమెస్టిక్ విధానంలో వినియోగిస్తున్నా రాయల్టీ మాత్రం రెండు విధాలుగా విధించారు.
పలుమార్లు కోరాందుర్గం రామచందర్, జీఎం, మణుగూరు
గోదావరి నీటిని డొమెస్టిక్ విధానంలోనే వినియోగిస్తున్నాం. రాయల్టీ మినహాయింపు ఇవ్వక పోయినా, డొమెస్టిక్ విధానంలో రాయల్టీ విధించమని కోరుతున్నాం. రాయల్టీ చెల్లింపునకు ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపించాం.

# ఏళ్లు గడవాల్సిందేనా?

జగిత్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో ఎలాంటి అభివృద్ధి పని చేపట్టినా ఏళ్లు గడవాల్సిందే. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదార్లు సకాలంలో పనులు పూర్తి చేయడం లేదు. 2018 ఫిబ్రవరి 25న అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కొండపైన రూ.5 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.2.50 కోట్లతో మాల విరమణ మండపం, రూ.2.50 కోట్లతో దాదాపు 2 కి.మీ వివిధ సౌకర్యాలతో మెట్లదారి అభివృద్ధి పనులు ప్రారంభించారు. కొండపైన వాహనాలు నిలిపే స్థలం మాల విరమణ మండల నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు పిల్లర్ల స్థాయిలోనే వదిలేశారు. ఐదున్నరేళ్లు గడిచినా మెట్లదారి పనుల ఊసేలేదు. ఫిబ్రవరి 15న ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి అధికారులతో కొండగట్టులో సమీక్ష నిర్వహించి రూ.100 కోట్లతో ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని పర్యాటక



ప్రాంతంగా మార్చాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు కొండపైన అమలు చేయాల్సిన బృహత్ ప్రణాళిక(మాస్టర్‌ప్లాను)కు తుదిరూపం రాలేదు. సీఎం పర్యటన తర్వాత వరద కాలువ నుంచి కొండపైకి నీటిని సరఫరా చేయడానికి రూ.13.45 కోట్లతో ప్రత్యేక ఎత్తిపోతల పథకానికి మంత్రి ఈశ్వర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రవిశంకర్ శంకుస్థాపన చేశారు. మెట్లదారికి ఇరువైపులా దట్టంగా పిచ్చిమొక్కలు పెరగడంతో వెళ్లడానికి భక్తులు భయపడుతున్నారు. వర్షాలు కురవడంతో గుట్టల్లోంచి వచ్చే నీరు మెట్లపై ప్రవహించి పాకురు పట్టడంతో జారుతున్నట్లు భక్తులు పేర్కొంటున్నారు. మాల విరమణమండపం నిర్మాణం కోసం వేసిన పిల్లర్ల ఇనుము తుప్పుపట్టిపోయింది.
గుత్తేదారుకు నోటీసులు జారీ చేశాం
వెంకటేశ్, ఆలయ ఈవో కొండగట్టు మాల విరమణ మండప నిర్మాణ పనులు ప్రారంభించి అర్ధంతరంగా వదిలేసిన గుత్తేదారుకు పలుమార్లు నోటీసులు జారీ చేశాం. మెట్లదారి పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. కొండపైన మాస్టర్‌ప్లాను అమలు చేయనున్నందున ఇంజినీరింగ్ అధికారులు మెట్లదారిని అభివృద్ధిపరిచే పనులు చేపడతారు. బృహత్‌ప్రణాళికకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి నివేదిక అందలేదు. కొండపైన చేపట్టే అభివృద్ధి పనుల పూర్తి బాధ్యత, పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులదే.

# జలపాతం.. జరభద్రం!

గూడూరు : చుట్టూ ఎత్తైన కొండలు.. ప్రకృతి రమణీయత.. పచ్చని చెట్ల నడుమ..పది అడుగుల పుట్టలతో అందంగా.. ఆకర్షణీయంగా ఆహ్లాదాన్ని పంచే పర్యాటక ప్రాంతం గూడూరు మండలం సీతానాగారం ప్రాంతంలోని భీముని పాదం జలపాతం. జాలువారుతున్న జలపాతం అందాలను చూసేందుకు పర్యాటకులు వరుస కడుతున్నారు. ఉత్సాహంగా..ఉల్లాసంగా గడిపేందుకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి వచ్చే పర్యాటకుల్ని ఆ ప్రాంతంలోని సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా గుంతల రహదారిపై ప్రయాణం చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకుల సౌకర్యార్థం కల్పించిన వసతులు సైతం సరిగా లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారులు రహదారి మరమ్మతులు చేయడంతో పాటు జలపాతం వద్ద సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా తగిన చొరవ చూపాలని పర్యాటకులు కోరుతున్నారు.
గుంతలపై ప్రయాణం
గూడూరు నుంచి భూపతిపేట 10 కి,మీ., దూరం ఉంటుంది. భూపతిపేట నుంచి సుమారు నాలుగు కి.మీ., దూరంలోని జలపాతం వరకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. గూడూరు నుంచి లైన్‌తండా మీదుగా ఆరు కిలోమీటర్ల దూరంలోని జలపాతం వరకు వెళ్లే దారి కూడా గుంతలమయమైంది. దీంతో పర్యాటకులకు కష్టాలు తప్పడం లేదు. మౌలిక వసతులు సమకూర్చితే పర్యాటక శాఖకు ఆదాయం పెరుగుతుంది. పర్యాటకులకు ఇబ్బందులు దూరమవుతాయి.
ఇలా చేస్తే మేలు వర్షాకాలంలో రోజుకు 200 మంది వరకు పర్యాటకులు వస్తుంటారు. తాగునీటి సౌకర్యం కల్పించాలి. విశ్రాంతి తీసుకునేందుకు కాటేజీల నిర్మాణం చేపట్టాలి జలపాతానికి వెళ్లే



రహదారిలో లోలెవల్ కాజ్‌వేలు ఉన్నాయి. వరదలతో అవి పొంగిపొర్లుతుండడంతో పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. వాటిపై వంతెనల నిర్మాణం చేపట్టాలి. విద్యుత్తు సౌకర్యం కల్పించాలిజలపాతం వద్దకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఏటా పెరుగుతుండడంతో అటవీశాఖ అధికారులు కొన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జలపాతంలో తడిసిన మహిళలు, పురుషులు దుస్తులు మార్చుకునేందుకు వేర్వేరు గదులను నిర్మించారు. అందులో వెలుతురు కోసం విద్యుత్తు దీపాల సౌకర్యం కల్పించలేదు. దాంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. ఖాళీ సీసాలను అక్కడ ఏర్పాటు చేసిన చెత్తకుండీల్లో వేయకుండా ఇష్టం వచ్చినట్లు పడేస్తున్నారు. భారీ వర్షానికి వచ్చే వరదలతో జలపాతం నుంచి జాలువారుతున్నాయి. నిల్వ ఉంటున్న నీటిలో ఉంటున్నాయి. ఆ నీటిలోకి దిగిన పర్యాటకుల కాళ్లకు గుచ్చుకుంటున్న సందర్భాలున్నాయి. సీసాలు ఇష్టం వచ్చినట్లు పడేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. జలపాతం సమీపంలో పర్యాటకులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన బెంచీల్లో కొన్ని శిథిలమయ్యాయి.

# సాంకేతిక లోపం.. దరఖాస్తుకు ఆటంకం

కరీంనగర్ : జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రకియ సాంకేతిక సమస్యతో సజావుగా సాగడంలేదు. గతేడాదిలా కాకుండా ఈ సారి అంతర్జాల దరఖాస్తు సమర్పణ ప్రక్రియలో పలు మార్పులు చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి విద్యార్థికి ఆధార్ నెంబర్ తప్పనిసరి చేయడంతో ఇక్కట్లు తప్పడంలేదు. విద్యాలయంలో 80 సీట్లకుగాను ఉమ్మడి జిల్లా పరిధిలో గతేడాది సుమారు 8 వేల దరఖాస్తులు రాగా ఈసారి ఇప్పటివరకు కనీసం 4 వేలు కూడా రాలేదు.

ఆధార్‌కు అనుసంధానం తప్పనిసరి

ఈ ఏడాది ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేయాలంటే విద్యార్థి ఆధార్ నంబర్‌కు చరవాణి సంఖ్య తప్పనిసరిగా నమోదై ఉండాలి. వారంతా పదేళ్లలోపు వారే కావడంతో చిన్న వయసులో ఆధార్ తీసుకొని ఉన్నారు. చాలామంది ఆధార్ నంబర్ నమోదై లేకపోవడంతో దరఖాస్తులు సమర్పించలేకపోతున్నారు. కొందరు పది రోజుల క్రితం చరవాణి సంఖ్య నమోదుకు ఆధార్ కేంద్రాలలో చేయించినా.. ఇప్పటికీ అప్‌డేట్ కావట్లేదు. దాని స్థానంలో నివాస ధ్రువీకరణపత్రం కావాలని అడుగుతుండడంతో ఆ పత్రం రావడానికి కనీసం వారం రోజులపైనే పడుతుంది. దరఖాస్తు సమర్పణకు శరఘాతంగా మారుతుంది.

గడువు పెంచకపోతే..

నవోదయ ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ ప్రకియ మొదలు కాకముందే చాలా మంది చిన్నారులు వేలాది రూపాయలు చెల్లించి శిక్షణ సంస్థల్లో చేరారు. కనీసం దరఖాస్తు కూడా చేయకపోతే శిక్షణ తీసుకుంటున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. కొద్ది మంది చిన్నారులకు ఆధార్‌కు చరవాణి సంఖ్య అనుసంధానమై ఉన్నా దరఖాస్తు ప్రకియ సజావుగా సాగడంలేదు. పలు రకాల సాంకేతిక సమస్యలతో చివరి నిమిషంలో నిలిచిపోతుంది.

కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది

మా బాబుకు చిన్నప్పుడు బాలల ఆధార్ తీసుకున్నాం. ఆ తర్వాత ఏం అవసరం రాకపోవడంతో దాన్ని అప్‌డేట్ చేయించలేదు. ప్రస్తుతం దరఖాస్తుకు తప్పనిసరి కావడంతో ఆధార్ కేంద్రాల చుట్టూ తిరిగి చరవాణి సంఖ్య నమోదు చేశాం. కానీ ఇంతవరకు అప్‌డేట్ కాలేదు. వాళ్లను అడిగితే సమయం పడుతుంది అని చెబుతున్నారు. ఏం చేయాలో తెలియడంలేదు.

తిరుపతి, విద్యార్థి తండ్రి

ఆన్‌లైన్ సమస్య ఉందట..

గత 20 రోజుల నుంచి మా నాన్న నవోదయ దరఖాస్తు చేసేందుకు తిరుగుతున్నాడు. నేటివరకూ ఇంకా కాలేదు. ఆన్‌లైన్ సమస్య ఉందని వారు మీసేవ కేంద్రాల వారు చెబుతున్నారు. మా స్నేహితులు సైతం ఇంకా ఎవరు దరఖాస్తు చేయలేదు. దరఖాస్తు చివరి గడువు దగ్గరకు వస్తుంది. సర్వర్ సమస్యను పరిష్కరించి గడువు పెంచాలి.

మహేశ్, విద్యార్థి, చొప్పదండి

నివాస ధ్రువీకరణ పత్రంతో వెసులుబాటు

ఆధార్‌కు చరవాణి సంఖ్య నమోదు లేని వారు నివాస ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. సాంకేతిక సమస్య గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. సమస్య త్వరగా పరిష్కారమవుతుంది.

మంగతాయారు, ప్రధానాచార్యులు, నవోదయ విద్యాలయం

# విద్యుత్తు కోతలు.. కర్షకుల వెతలు

జగిత్యాల : విద్యుత్తు కోతలను నిరసిస్తూ జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో రైతులు విద్యుత్తు ఉపకేంద్రం ఎదుట ధర్నాచేశారు. కేవలం రాయికల్ మండల రైతులే కాదు ఉమ్మడి జిల్లాలోని అన్నదాతలు విద్యుత్తు కోతలతో పంటలకు నష్టం వాటిల్లుతుందంటూ రోడ్డెకాల్సి రావటం త్రీఫేజ్ సరఫరా లోపాన్ని కళ్లకు కడుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఆయకట్టుకు శ్రీరాంసాగర్, ఎల్ఎండీ తదితర ప్రాజెక్టుల నీరు వస్తున్నా వారబంధీ పద్ధతిలో నీటిని వదులుతుండటం, చివరి ఆయకట్టుకు కాలువనీరు రాకపోవటంతో వ్యవసాయ పంపుసెట్లను రైతులు తప్పనిసరిగా వాడాల్సి వస్తోంది. క్రమంలో అంచనా కన్నా వినియోగం భారీగా పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నా ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్తు కొనుగోలు ఆశించిన ట్లుగా లేక సరఫరా సమయాన్ని అనధికారికంగా కుదిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అధికారికంగా 3.85 లక్షల వరకు వ్యవసాయ పంపుసెట్లుండగా వరదకాలువ, కాకతీయ కాలువ, ఇతరత్రా బావులకు అనధికారికంగా దాదాపుగా 21 వేల వరకు పంపుసెట్లను వాడుతున్నట్లు అంచనాగా ఉంది. వ్యవసాయంతో పాటుగా ఇళ్లు, పరిశ్రమలు, ఇతర వాణిజ్య అవసరాలకు కూడా విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. జగిత్యాల జిల్లాలో గతనెల ఆరంభంలో రోజు సగటు విద్యుత్తు వాడకం 3.10 మిలియన్ యూనిట్లుండగా శుక్రవారం 3.48 మిలియన్ యూనిట్లకు, శనివారం 4.39 మిలియన్ యూనిట్లకు చేరింది. మిగిలిన మూడు జిల్లాల్లోనూ ఇదేరీతిన విద్యుత్తు వాడకం గణనీయంగా పెరుగుతుండగా మరోవైపు పైనుంచి ఆశించినట్లు సరఫరా చేయనందున స్థానికంగా అనధికారికంగా కోతలు విధిస్తున్నారు. మరోవైపు త్రీఫేజ్ సరఫరా సమయం స్థానిక అధికారులకు కూడా తెలపనందున వీరినుంచి సమాధానంలేక రైతులు ఆందోళనలతో పొలాలవద్దే గంటల తరబడి పడిగాపులు పడుతున్నారు. వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తామని ప్రభుత్వం పేర్కొనటం, భూగర్భ జలలభ్యత బాగుండటంతో ఉమ్మడి జిల్లా రైతులు ఈ యాసంగిలో గరిష్ఠ విస్తీర్ణంలో పంటలను పండించారు. 7.40 లక్షల ఎకరాల్లో అన్నిరకాల పంటలను పండిస్తారని అధికారులు అంచనా వేసినా ఇప్పటికే 8.90 లక్షల ఎకరాల్లో రైతులు అన్ని రకాల పంటలను విత్తుకున్నారు. ఇందులో వరిసాగే 7 లక్షల ఎకరాలను దాటడం, ఇంకనూ వరినాట్లు కొనసాగుతుండటం, నువ్వులు, ఆరుతడి పంటలను విత్తుతుండటం సాగుజోరును వెల్లడిస్తుండగా ఆదిలోనే విద్యుత్తు సమస్య రైతులను వెన్నాడుతోంది. వారం రోజులుగా విద్యుత్తు సరఫరా వేళల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. కొన్నిసార్లు ఉదయం, మరికొన్నిసార్లు మధ్యాహ్నం తరువాత లేదా రాత్రి 11 గంటల నుంచి త్రీఫేజ్ సరఫరా ఉండటం, చాలాసార్లు సరఫరా ట్రిప్‌కావటంతో రైతులు పొలాలవద్దనే ఉండాల్సివస్తోంది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల సెల్సియస్‌కు చేరటం, పంటల కీలక దశలు కాబట్టి కనీసం ఒక ఒకరానికి నీరివ్వాలంటే రోజుకు ఆరేడు గంటలపాటు పంపుసెట్ నిరంతరాయంగా నడవాలి. కానీ సరఫరా సమయం కుదింపు, సరఫరాలో అంతరాయంతో చివరిమడులకు నీరు వెళ్లటంలేదని రైతులు వాపోతున్నారు. మరో వారంరోజులు ఇదే పరిస్థితి కొనసాగితే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.సమస్య పరిష్కారానికి తగిన చర్యలు- సత్యనారాయణ, ఎస్ఈ, జగిత్యాల జిల్లాప్రస్తుతం లోడ్ గణనీయంగా పెరగగా పైనుంచి తగిన సరఫరాలేక స్థానికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సమస్యను ప్రభుత్వానికి నివేదించాం. మరో నాలుగైదు రోజుల్లో సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది.

# గ్రామం నిండా.. బూడిద ట్యాంకర్లే!



భూపాలపల్లి : ఆ గ్రామంలో ఎక్కడ చూసినా బూడిద లారీలే.. దాదాపు రెండిళ్లకు ఒకటి చొప్పున ఉంటాయి. థర్మల్ కేంద్రంతో భూములు కోల్పోయిన రైతులు ట్యాంకర్లను కొనుగోలు చేసి బూడిద వ్యాపారం చేస్తుండగా.. పరోక్షంగా 100 మందికి పైగా డ్రైవర్లు, క్లీనర్లుగా ఉపాధి పొందుతున్నారు.. దీంతో గణపురం మండలం చెల్పూరు శివారు దుబ్బపల్లి గ్రామంలో ప్రత్యేకంగా నిలుస్తోంది. గ్రామం ఒకప్పుడు వ్యవసాయ ఆధారితం.. ఆరుగాలం కష్టపడి పంటలు పండించుకునేవారు.. ఇప్పుడంతా మారింది.. రైతులు కాస్తా వ్యాపారులుగా మారారు. పలుగు పార పట్టుకునే చేతులతో స్టీరింగ్ పట్టుకుంటున్నారు. బూడిద వ్యాపారం చేస్తూ లాభాలతో దినదినాభివృద్ధి చెందుతున్నారు. గ్రామంలో 297 కుటుంబాలుంటే.. 94 బూడిద లారీలు ఉన్నాయి. పదికి పైగా టిప్పర్లు ఉన్నాయి. 2006 ముందుకు పూర్తి వ్యవసాయ గ్రామమైన దుబ్బపల్లికి పేరుకు తగ్గట్లే.. ఆ గ్రామానికి దుబ్బరోడ్డే ఉండేది.. అంతర్గత రహదారులు సైతం ఉండేవి కావు.. అప్పటి ఏపీ జెన్‌కో చెల్పూరు శివారు దుబ్బపల్లి గ్రామంపై కన్నేసింది. ఇక్కడ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి 997 ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చ్డేసింది. పరిహారం, నిర్వాసితుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చింది. కొంతమంది తమ వ్యవసాయ భూములు అమ్మగా వచ్చిన పెద్ద మొత్తంతో లక్షలాది రూపాయలు వెచ్చించి బూడిద లారీలు కొనుగోలు చేశారు.

ఇతర ప్రాంతాలకు తరలిస్తూ..

కేటీపీపీ బూడిదను సిమెంటు, బూడిద ఇటుకల కర్మాగారాలు, రెడ్‌మిక్స్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. రవాణాకు స్థానికంగా ఉండే బూడిద లారీలనే వాడాలనే నిబంధన ఉండడంతో బూడిద తరలింపు ఇక్కడి వారికి మంచి వ్యాపారంగా మారింది. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని కోదాడ, తాండూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో కంపెనీలకు తరలిస్తారు. ఇలా రోజులో సుమారు వంద ట్యాంకర్ల బూడిదను తరలిస్తారు. కేటీపీపీలోని సైలో కేంద్రాల వద్ద బూడిద లోడింగ్‌ను కేటీపీపీ సిబ్బంది చేస్తారు. లారీల యజమానులంతా కలిసి సంఘం ఏర్పాటు చేసుకున్నారు. దుబ్బపల్లి రోడ్డు పక్కన ఓ శాశ్వత భవనాన్ని సైతం నిర్మించుకున్నారు. ఏటా ఎన్నికలు నిర్వహించి కమిటీని ఎన్నుకుంటారు.

పన్నులు రద్దు చేస్తే మేలు..- ముకిరాల తిరుపతిరావు, బల్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు, దుబ్బపల్లి

మేము థర్మల్ కేంద్రానికి వ్యవసాయ భూములన్నీ ఇచ్చేశాం.. చేయడానికి ఏం పని లేక బూడిద వ్యాపారం చేసుకుంటున్నాం. బాగానే ఉంది.. అయితే బూడిద రవాణాకు ప్రభుత్వం రోడ్డు పన్నులు విపరీతంగా పెంచింది. వాటిని రద్దు చేయాలి.

పలువురు ఉపాధి పొందుతున్నారు- లింగంపెల్లి నర్సింగరావు, దుబ్బపల్లిమా లారీలతో అనేక మంది ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా డ్రైవర్లు గ్రామంలో ఎక్కువయ్యారు. డ్రైవింగ్ నేర్చుకోవాలనే తలంపుతో యువకులు క్లీనర్లుగా వాటి వెంట వెళ్తున్నారు. నిరుద్యోగులు అనేక మంది ఉపాధి పొందుతుండడం సంతోషంగా ఉంది.

# పెరిగిన గిరాకీ.. తగ్గిన సరఫరా



జనగామ : అప్రకటిత కరెంటు కోతలతో కళ్లెదుటే పచ్చని పంట చేలు ఎండిపోతుంటే అన్నదాతల రగిలిపోతున్నారు. వ్యవసాయ పంపుసెట్లకు నాణ్యమైన విద్యుత్తు అందించాలని కదం తొక్కుతున్నారు. గత తొమ్మిదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో విద్యుత్తు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో రైతులకు కష్టాలు వచ్చిపడ్డాయి. గడిచిన ఇరవై రోజుల నుంచి విద్యుత్తు సమస్యలు ఎదురవుతుండగా.. స్థానిక అధికారులు చెబుతున్న జవాబుకు భిన్నంగా కరెంటు కష్టాలు ఎక్కువయ్యాయి. 24 గంటల సరఫరా దేవుడెరుగు.. నాణ్యమైన కరెంటు 12 గంటలు ఇవ్వండంటున్న హలధారుల మొరను ఆలకించే నాథులే కరవయ్యారు.

విద్యుదుత్పత్తి తగ్గినందునే..: గ్రిడ్‌లో తలెత్తిన సమస్య కారణంగానే విద్యుత్తు సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. కరెంటు ఉత్పత్తి తగ్గడం వల్లే వినియోగానికి సరిపడా కరెంటు సరఫరా కావడం లేదని చెబుతున్నారు. వ్యవసాయ మోటార్లకు గత ఇరవై రోజుల నుంచి పట్టుమని పది గంటలు కూడా సక్రమంగా కరెంటు రావడం లేదని వివిధ గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మాత్రం వ్యవసాయ రంగానికి ఎలాంటి కోతల్లేవని షిఫ్టు పద్ధతిలో సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఒకవేళ సరఫరా ఉన్నా మోటారు ఆన్ చేసిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే కరెంటు పోతోందని బుచ్చినాయక్ తండా, మహేశ్వరం, మూడుచెక్కలపల్లి గ్రామాల రైతులు తెలిపారు. నర్సంపేట డివిజన్‌లో మొత్తం 27 విద్యుత్తు సబ్ స్టేషన్లుండగా అన్నింటి పరిధిలో కరెంటు కోతలున్నట్లు ఆయా గ్రామాల రైతులు చెప్పారు. గతంతో పోలిస్తే పంటల విస్తీర్ణం కూడా పెద్దగా పెరిగిందేమీ లేదని వ్యవసాయ గణాంకాలను బట్టి తెలుస్తోంది. ప్రస్తుతం డివిజన్‌లో త్రీఫేజ్‌కు 80 మెగా వాట్స్ లోడ్ ఇస్తున్నామని సింగిల్ ఫేజ్‌కు 25 మెగావాట్స్ సరఫరా చేస్తున్నట్లు డిస్కం అధికారులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే సరఫరాకు, డిమాండ్‌కు మధ్య 30 శాతం లోడింగ్ తక్కువగా ఉన్నట్లు సమాచారం.

గ్రామాల్లో ఆందోళనలు: అప్రకటిత కరెంటు కోతలు ఎత్తివేయాలని, నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని డిమాండ్‌తో డివిజన్ వ్యాప్తంగా ఆందోళనలు సాగుతున్నాయి. బిల్లుల వసూలు కోసం వచ్చిన ఉద్యోగిని నల్లబెల్లి మండలం కొండాయిలుపల్లి రైతులు గదిలో నిర్బంధించారు. భాజపా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నెక్కొండ మండలం అలంఖానిపేటలో రైతులు ఆందోళన చేశారు.

మొక్కజొన్న ఎండిపోతోంది- సొల్లేటి రవి, అలంఖానిపేట

పక్షం రోజుల నుంచి కరెంటు కోతలతో మొక్కజొన్న చేలకు సాగునీర ందక ఎండిపోతున్నాయి. అప్రకటిత కోతలతో కరెంటు మోటార్లు నడవడం లేదు. రాత్రి వేళ కరెంటు ఇవ్వడంతో బావుల వద్ద నిద్రిస్తున్నాం. ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని స్థితిలో జాగారం చేస్తున్నాం.

# త్రిశంకు స్వర్గంలో భాషా పండితులు

ములుగు : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇది శుభ పరిణామమే అయినప్పటికీ.. అందులోని ఒక వర్గం ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. బదిలీలు, పదోన్నతులనేవి అందరికి వర్తించాల్సి ఉండగా భాషా పండితులకు మాత్రం వర్తించడం లేదు. 2015 తర్వాత బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఈ విషయంలో భాషా పండితులు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. కోర్టు కేసు ఉందనే సాకుతో ఈ సారి భాషా పండితుల పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం వాయిదా వేయడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అధికారికంగా ఎస్‌జీటీగా బోధన చేస్తున్న భాషా పండితులు ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంటు విధులు నిర్వర్తిస్తున్నారు. తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. 317 జీవో ప్రకారం ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుల సమస్య మరొకటి. బదిలీ అయిన జిల్లాకు వచ్చే సరికి వారు ఎంత సర్వీసు ఉన్నా పూర్తిగా సీనియారిటీని కోల్పోయారు. వారి సీనియారిటీ మొదటికి వచ్చింది. దీంతో బదిలీల్లో ప్రాధాన్యతను కొల్పోయే పరిస్థితి నెలకొంది. వీరికి ప్రాధాన్యత ఇవ్వాలనేది కొందరి ఉపాధ్యాయుల వాదన. ఈ సమస్య ప్రధానంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉంది.పీఈటీల పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. పదోన్నతులు లేకుండా పోయాయి. ఎన్నేళ్లు పని చేసినా ఎస్‌జీటీ స్థాయిలోనే ఉంటున్నారు. ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న వారికి పదోన్నత కల్పించాలనేది ప్రధాన డిమాండు. పీఈటీలు ప్రస్తుతం గ్రేడు 2 కింద ఎస్జీటీగా పని చేస్తున్నారు. ఆ పోస్టును గ్రేడ్ 1గా ఉన్నతీకరించి స్కూలు అసిస్టెంటు స్థాయిలో ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించాలనే డిమాండు పీఈటీల నుంచి ఉంది.

బోధన నిలిపివేస్తాం- హమీద్, భాషా పండితుల సంఘం రాష్ట్ర కార్యదర్శిభాషా పండితులకు పదోన్నతులు చేపట్టకుంటే ఫిబ్రవరి 1 నుంచి 9, 10 తరగతులకు బోధన నిలిపివేస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వానికి సంకేతం ఇచ్చాం. కోర్టు కేసు ఉందనే సాకుతో పదోన్నతులు నిలిపివేయడం సమంజసం కాదు.

రాజకీయ పలుకుబడితో..- ఏళ్ల మధుసుదన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలి. జీరో సర్వీసు బదిలీలకు అనుమతి ఇవ్వాలి. స్పౌజ్ బదిలీలు చేయాలి. బదిలీలను అపహాస్యం చేస్తూ రాజకీయ పలుకుబడితో చేస్తున్న వందలాది పైరవీ బదిలీలు నిలుపుదల చేయాలి. కనీస రెండేళు కాకుండా జీరో సర్వీసుకు అనుమతిస్తూ.. పారదర్శకంగా బదిలీలను నిర్వహించాలి.స్పౌజ్ ఉత్తర్వులు విడుదల చేయాలి- వాసుదేవరెడ్డి, యూటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి

317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన వారిని సొంత ప్రాంతాలకు పంపించాలి. పండిట్, పీఈటీల అక్రిడేషన్ పదోన్నతులు ఇవ్వాలి. 317 జీవోను రద్దు చేయాలి. ఎస్సీ, ఎస్టీలకు రోస్టర్ పద్ధతిలో పదోన్నతులు కల్పించాలి. ఎస్‌జీటీ, భాషా పండితులకు స్పౌజ్ ఉత్తర్వులు విడుదల చేయాలి.

పాత పద్ధతి అనుసరిస్తే మేలు- హట్కర్ సమ్మయ్య, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడురోస్టర్ పద్ధతి పాటించకపోవడంతో లోకల్ బాడీలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుంది. గతంలో ఏజెన్సీలో పని చేస్తున్న ఎస్టీ ఉపాధ్యాయులకు, లోకల్‌బాడీలో పని చేస్తున్న ఎస్టీ ఉపాధ్యాయులకు వేర్వేరుగా పదోన్నతులు ఇచ్చారు. ఏజెన్సీలో పని చేసే వారికి త్వరగా పదోన్నతి వచ్చింది. ప్రస్తుత ప్రక్రియతో ఎస్టీలకు అన్యాయం జరుగుతోంది. పాత పద్ధతిలో పదోన్నతులు కల్పించాలి.

నిబంధనల ప్రకారమే..: సుదర్శన్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ కో-ఆర్డినేటర్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. 317 జీవోలో బదిలీ అయి వచ్చిన వారికి అవకాశం లేదు. కనీసం మూడేళ్ల సీనియారిటీ ఉండాలి. ఇప్పటికే ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అంతా ఆన్‌లైన్ పద్ధతిలోనే పదోన్నతులు, బదిలీలు జరుగుతాయి.

# మరింత కట్టుదిట్టంగా!

ఖమ్మం :చర్ల మండలంలో ఓ రైతు చనిపోయారు. అతని కుటుంబ సభ్యులకు రైతు బీమా గురించి తెలియదు. రైతు చనిపోయిన విషయం వ్యవసాయ విస్తరణ అధికారులకూ తెలియదు. 80 రోజుల తరవాత విషయం తెలిసింది. తర్వాత రైతు బీమా పరిహారం పొంద గలిగినా వ్యవసాయ అధికారులు దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఏకంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు బీమా నియమ నిబంధనల్లో మార్పులు చేర్పులు చేశారు. ర్కైతు కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం అన్నదాతల కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తోన్న విషయం విదితమే. ప్రమాదం లేదా అనారోగ్యంతో కర్షకుడు మృతి చెందితే ఆ కుటుంబానికి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఆర్థిక సాయంగా అందిస్తుంది. రైతుల తరపున బీమా ప్రీమియం సొమ్మును ఏటా ప్రభుత్వమే చెల్లిస్తోంది.

స్థానిక అధికారులదే బాధ్యత..

ఒక రైతు మృతి చెందితే అందుకు సంబంధించి రైతు బీమా దరఖాస్తు ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలి. ఆ బాధ్యతను ఆ గ్రామ వ్యవసాయ విస్తరణ, మండల వ్యవసాయ అధికారులపైనే ఉంచారు. బాధిత కుటుంబ సభ్యులు సమాచారాన్ని వ్యవసాయ విస్తరణ అధికారులకు చెప్పాలి. లేదా వ్యవసాయ విస్తరణ అధికారులే ఏదోవిధంగా తెలుసుకోవాలి. తెలుసుకున్న వెంటనే ధ్రువీకరణ పత్రాలన్నీ సిద్ధం



చేయించి లేకుంటే తామే చేసి రైతుబీమా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇదంతా వారంలో జరగాలి. లేనట్లయితే జిల్లా వ్యవసాయ అధికారులు సంబంధిత ఏవోలు, ఏఈవోలను తమ కార్యాల ఓయానికి పిలిపించుకుంటారు. ఆ ప్రక్రియను ఎందుకు పూర్తి చేయలేదో అడుగుతూ ఓ ప్రత్యేక రికార్డులో వారి వివరణ తీసుకుంటారు. భద్రాద్రి జిల్లాలో గడిచిన అయిదేళ్లలో 2597 మంది రైతులకు 129.85 కోట్లను రైతుబీమా పరిహారంగా అందజేశారు.“కుంట నుంచి ఆపై ఎన్ని ఎకరాలున్నా రైతు బీమాకు అర్హులే. వయసు 18 ఏళ్ల నుంచి 59ఏళ్ల లోపు ఉండాలి. కొత్తగా చేరేందుకు, దరఖాస్తుల్లో మార్పులుచేర్పులకు గ్రామ వ్యవసాయ విస్తరణ, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. రైతు మృతి చెందగానే మరణ ధ్రువీకరణ పత్రం, పాసు పుస్తకం, ఆధార్, నామినీ ఆధార్ కార్డు, నామినీ బ్యాంకు ఖాతా పుస్తకం, బీమా క్లెయిం పత్రం వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలి. దళారుల ప్రమేయం లేకుండా నామినీ ఖాతాలో రూ.5 లక్షలు జమవుతాయి.”కె.అభిమన్యుడు, భద్రాద్రి జిల్లా వ్యవసాయ అధికారి

# దుకాణాల ఏర్పాటుకు వ్యాపారుల అనాసక్తి

తూప్రాన్: వ్యాపార, వాణిజ్య అవసరాలకు రూ.11 కోట్లతో తూప్రాన్‌లో నిర్మించిన సమీకృత విపణి సముదాయంలో దుకాణాలు (షట్టర్లు) అద్దెకు తీసుకునే వారు కరవయ్యారు. గతేడాది సెప్టెంబరు 2న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఈ భవనాన్ని ప్రారంభించారు. రోడ్డు వైపు 10 వ్యాపార వాణిజ్య దుకాణాలు, లోపల కూరగాయల విక్రయాలు, మొదటి అంతస్తులో మాంసం దుకాణాలు, రెండో అంతస్తులో షాపింగ్‌మాల్స్ ఏర్పాటుకు అనుగుణంగా భవనాన్ని నిర్మించారు. మొదటి అంతస్తులో కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయగా.. రెండో అంతస్తులో మాంసం దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అధిక ఆదాయం వచ్చేలా రోడ్డు వైపు నిర్మించిన 10 దుకాణ గదులు ప్రారంభం నుంచి ఖాళీగానే ఉంటున్నాయి. దీంతో అరకొర ఆదాయంతోనే సమీకృత మార్కెట్‌ను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణానికి దూరంగా ఉండడంతో వ్యాపారస్తులు ఆసక్తి చూపడం లేదని పలువురు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కథనం.

కనీస అద్దెగా రూ.3300

తూప్రాన్‌లో నిర్మించిన సమీకృత విపణి భవనంలో వాణిజ్య దుకాణాల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఇప్పటి వరకు మూడుసార్లు టెండర్లు పిలిచారు. దరఖాస్తులు తక్కువగా రాకపోవడంతో ఈ ప్రక్రియను నిలిపివేశారు. ఒక్కో దుకాణానికి నెలకు కనీస అద్దెగా రూ.3300 నిర్దేశించారు. డిమాండ్‌ను బట్టి పెంచే ఆలోచన చేసినప్ప



టికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో కనీస అద్దెకు ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. ఇదే విషయాన్ని మార్కెటింగ్ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రస్తుతం నెలకు రూ.3.50లక్షల ఆదాయం సమకూరాల్సి ఉండగా.. రూ.1.50లక్షలు మాత్రమే వస్తోంది. వ్యాపారాలు సరిగా నడవని కారణంతో పలువురు అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదు.

మరోసారి టెండర్ నిర్వహిస్తాం..

షాబుద్దీన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

తూప్రాన్ సమీకృత విపణి భవనం కొత్తగా నిర్మించడంతో వ్యాపారాలు ఇంకా పెరగాల్సి ఉంది. గతంలో టెండర్లు పిలవగా.. అనుకున్నంత మేర దరఖాస్తులు రాలేదు. మరోసారి టెండర్ వేస్తాం. స్పందన లేకుంటే ముందుకు వచ్చే వారికి కనీస అద్దెకు దుకాణాలను కేటాయిస్తాం. ఆసక్తి ఉన్న వ్యాపారులు మార్కెటింగ్ అధికారులను సంప్రదించాలి.

# లోకేష్ పాదయాత్రలో బిగ్ చేంజ్...మ్యాటరేంటి...?



విజయవాడ : టీడీపీ యువ నేత నారా లోకేష్ పాదయాత్రలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దానికి కారణాలు ఐతే ఏమీ తెలియడంలేదు కానీ చినబాబు పాదయాత్ర ఇపుడు జెట్ స్పీడ్ తో గమ్యం వైపుగా సాగుతోంది. ఈ ఏడాది జనవరి 27న ఉమ్మడి చిత్తూరు జిల్లా కుప్పంలో లోకేష్ పాదయాత్ర మొదలైంది. అది లగాయితూ ఆయన ఒక్క చిత్తూరు జిల్లాలోనే నెల రోజుల పాటు తిరిగారు. అక్కడ నుంచి అనంతపురంలో కూడా ఇరవై రోజులకు తక్కువ కాకుండా తిరిగారు. అలాగే కర్నూల్, కడపలతో పాటు నెల్లూరు జిల్లాలలో ప్రతీ నియోజకవర్గం టచ్ చేస్తూ లోకేష్ పాదయాత్ర సాగింది. అయితే ప్రకాశం జిల్లాలు వచ్చేసరికే పాదయాత్ర రూట్ మ్యాప్ కంప్లీట్ చేంజి అయింది అని అంటున్నారు. ఈ జిల్లాలో కొన్ని నియోజకవర్గాలకే పాదయాత్ర పరిమితం అయింది. టీడీపీని గెలిపించిన చీరాల, పర్చూరులలో నారా లోకేష్ పాదయాత్ర చేపట్టకుండానే గుంటూరు జిల్లాకు వచ్చేశారు. ఇక గుంటూరులో చూస్తే గుంటూరు నగరంతో పాటు, రేపల్లె, బాపట్ల, పొన్నూరు, తెనాలి, నరసరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాలలో లోకేష్ పాదయాత్ర లేదు. అంతే కాదు మంత్రి అంబటి రాంబాబు నియోజకవర్గం సత్తెనపల్లిలో కూడా మొక్కుబడిగానే సాగింది. కానీ మంగళగిరిలో మాత్రం లోకేష్ అయిదు రోజుల పాటు పాదయాత్ర చేశారు. అక్కడ నుంచి క్రిష్ణా జిల్లాలోనికి ఈ రోజు అడుగు పెట్టిన లోకేష్ జస్ట్ నాలుగు రోజులు మాత్రమే పాదయాత్ర చేయనున్నారు. ఈ జిల్లాలో విజయవాడ వెస్ట్, ఈస్ట్, పెనమలూరు, గన్నవరం లలోనే పాదయాత్ర సాగనుంది. ఈ జిల్లాలో కీలకమైన నియోజకవర్గాలుగా ఉన్న జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామ, మైలవరం నియోజకవర్గాలలో లోకేష్ పాదయాత్ర లేదు. అంతే కాదు, ఇదే జిల్లాలో ఉన్న పెడన, పామర్రు, మచిలీపట్నం, గుడివాడ నియోజకవర్గాలలో కూడా లోకేష్ పాదయాత్ర చేయడంలేదు. ఈ నెల 22 నుంచి ఆయన ఉభయ గోదావరి జిల్లాలలో పాదయాత్రకు రెడీ అవుతున్నారు. ఎక్కువగా గోదావరి జిల్లాలలో పాదయాత్ర చేయాలని డెసిషన్ తీసుకున్నారని అంటున్నారు. ఆ తరువాత ఉత్తరాంధ్రాకు వచ్చి అక్కడ మూడు జిల్లాలను తొందరగా ముగించాలని చూస్తున్నారు. మొత్తం మీద ఈ ఏడాది నవంబర్ లోగానే లోకేష్ పాదయాత్రను ముగించేలా టీడీపీ ప్లాన్ చేస్తోంది అని అంటున్నారు. ఒక వైపు ఎన్నికలు ముంచుకు వస్తున్న నేపథ్యం ఉంది. మరో వైపు పార్టీ చాలా విషయాల్లో ఆలోచిస్తోంది. పొత్తులు కనుక లేకపోతే సింగిల్ గా దిగాలని అనుకుంటోంది. ఈ పరిణామాల నేపథ్యంలో లోకేష్ పాదయాత్ర ముగించి పార్టీతో నిరంతరం ఉంటూ చాలా విషయాలను పంచుకోవాలని చూస్తున్నారు. అందుకే దానికి తగినట్లుగా పాదయాత్రలో మర్పులు చేసారని అంటున్నారు. అయితే ఈ విధంగా లోకేష్ పాదయాత్రను కుదించడం పట్ల తమ్ముళ్ళు మాత్రం అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అయితే లోకేష్ ఇప్పటికే 2500 కిలోమీటర్లు నడిచారు. మరో పదిహేను వందలు నడిస్తే నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర టార్గెట్ పూర్తి అవుతుంది. అందుకే పార్టీ ఈ బిగ్ చేంజిని చేస్తోంది అని అంటున్నారు. అంతే కాదు, రాయలసీమ జిల్లాలో వైసీపీ గ్రాఫ్ ని తగ్గించేందుకే ఎక్కువగా లోకేష్ తిరగాల్సి వచ్చిందని, కోస్తా జిల్లాలలో ఎటూ టీడీపీకి మొగ్గు ఉంటుంది కాబట్టి లోకేష్ పాదయాత్రలో చేంజి చేసినా ఇబ్బంది రాదన్నది పార్టీ పెద్దల వ్యూహంగా ఉంది అని అంటున్నారు.




వాషింగ్టన్: ఉత్తర అమెరికా దేశాలను కార్చిచ్చు వణికిస్తోంది. బలమైన గాలుల కారణంగా వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే హవాయి ద్వీపంలో బీభత్సం సృష్టించిన ఈ కార్చిచ్చు.. ఇప్పుడు అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రం వైపు దూసుకొస్తోంది. దీంతో వెంటనే ఖాళీ చేయాలని పలు ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వాషింగ్టన్‌లోని స్పోకాన్ కౌంటీ సమీపంలో మొదలైన ఈ కార్చిచ్చు కొన్ని గంటల వ్యవధిలోనే 500 నుంచి 3 వేల ఎకరాలకు విస్తరించింది. బలమైన గాలులే అందుకు కారణమయ్యాయని వాషింగ్టన్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ నేచురల్ రిసోర్సెస్ వెల్లడించింది. దీనివల్ల ఇప్పటికే కొన్ని ఇళ్లు కాలిపోయి ఆస్తినష్టం కూడా సంభవించినట్లు తెలిపింది. దాంతో కౌంటీలోని మెడికల్ లేక్ పట్టణ ప్రజలకు లెవెల్ 3 అలర్ట్ జారీ అయింది. వెంటనే ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని దీని అర్థం. ఈ కార్చిచ్చు దూసుకొస్తుండటంతో మెడికల్ లేక్‌లోని ఓ ఆసుపత్రిలో వైద్యులు, రోగులను తరలించేందుకు ప్రభుత్వం నేషనల్ గార్డ్ ట్రూప్స్‌ను రంగంలోకి దింపింది. ఫోర్ లేక్స్ పట్టణానికి కూడా లెవెల్ 3 ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే స్పోకాన్ కౌంటీలోని 13 వేలమంది ప్రజలున్న చెనెయ్ నగరానికి లెవెల్ 2 అలర్ట్ ఇచ్చారు. సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని దీనర్థం. భారీగా నమోదైన ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులు, బలమైన గాలులు అగ్నికీలల వ్యాప్తికి కారణమవుతాయని జాతీయ వాతావరణ విభాగం తెలిపింది.

**ఘోస్ట్ టౌన్‌గా మారిన ఎల్లో నైఫ్..** కెనడాలో అత్యంత వేగంగా వ్యాపిస్తున్న కార్చిచ్చులు వేలాది మంది ఇతర ప్రాంతాలకు తరలిపోయేట్లు చేస్తున్నాయి. ఈ దేశంలోని నార్త్‌వెస్ట్ టెరిటరీస్‌లో 200పైగా కార్చిచ్చులు రాజుకున్నాయి. నార్త్ వెస్ట్ టెరిటరీస్ రాజధాని ఎల్లోనైఫ్‌లోని 20 వేల మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. దాంతో ఆ ప్రాంతం ఘోస్ట్ టౌన్‌గా మారిపోయింది. శుక్రవారం సాయంత్రం నాటికి 48 గంటల్లో 19 వేల మంది నగరాన్ని ఖాళీ చేశారు. కొంతమంది సొంత వాహనాల్లో వెళ్లిపోగా.. ఇంకొందరిని ఎమర్జెన్సీ విమానాల్లో తరలించారు.

# యూఎస్ తెలుగు విద్యార్థుల ఉదంతంపై సీఎం జగన్ ఆరా



అమరావతి: అమెరికా నుంచి కొంత మంది తెలుగు విద్యార్థులు వెనక్కి పంపిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరా తీశారు. విద్యార్థుల వివరాలు తెలుసుకుని త్వరితగతిన వారి సమస్యను పరిష్కరించాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. 21 మంది భారతీయ విద్యార్థులను అమెరికా నుండి వెనక్కు పంపించిన ఘటన సంచలనం సృష్టించింది. వీరిలో తెలుగువారు కూడా ఉండటంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ ఉదంతంపై అరా తీశారు. విద్యార్థుల పూర్తి వివరాలతో పాటు పూర్తి సమాచారాన్ని సేకరించాలని సీఎంవో అధికారులను ఆదేశించారు.

ఈ అంశంపై దృష్టి సారించాలని చెబుతూనే అవసరమైతే విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు కూడా జరపాలని సీఎంవో అధికారులకు సూచించారు. ఎన్నోఆశలతో ఉన్నత విద్య నిమిత్తం అమెరికా చేరుకున్న తాము అన్ని డాక్యుమెంట్లను సమర్పించామన్నారు విద్యార్థులు. ఇమ్మిగ్రేషన్ అధికారులు వారి పత్రాలను తనిఖీ చేసి, కొద్దిసేపు విచారించాక కారణం చెప్పకుండానే వారిని వెనక్కి పంపించేశారు. వారిలో అత్యధికులు అట్లాంటా, చికాగో, శాన్ ఫ్రాన్సిస్కో విమానాశ్రయాలలో దిగారు.

# గన్నవరం ఎమ్మెల్యే కాన్వాయ్‌కు ప్రమాదం



చివ్వెంల: గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కాన్వాయ్‌కు ప్రమాదం జరిగింది. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కాశీంపేట వద్ద (విజయవాడ – హైదరాబాద్ 65 జాతీయ రహదారిపై) ఈ ఘటన జరిగింది. పలు పనుల నిమిత్తం ఇవాళ ఎమ్మెల్యే వంశీ తన కాన్వాయ్‌లో విజయవాడ నుంచి హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యంలో కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. కాన్వాయ్‌లోని చివరి రెండు వాహనాలు ఒకదానికొకటి పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సమాచారం. రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి.

# అధికార పార్టీకి ఒక రూల్, ప్రతిపక్షానికి ఒక రూలా?: ధూళిపాళ్ల నరేంద్ర ఫైర్



దెందులూరు: ఓటమి భయంతో పంచాయతీ ఉప ఎన్నికల్లో వైకాపా అక్రమాలకు పాల్పడుతోందని తెదేపా సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. దెందులూరు నియోజకవర్గం వీరమ్మకుంటలో తెదేపా కార్యకర్తలపై వైకాపా మూకల దాడి దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అండ చూసుకునే వైకాపా కార్యకర్తలు దాడులకు తెగబడ్డారని దుయ్యబట్టారు. అధికార పార్టీ అక్రమాలు, దాడులు, దౌర్జన్యాలకు పోలీసులు వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. అధికార పార్టీకి ఒక రూల్, ప్రతిపక్షానికి ఒక రూల్ పెట్టారా?అంటూ మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి దెందులూరు నుంచి పారిపోవడం ఖాయమని అన్నారు. వీరమ్మకుంటలో చోటు చేసుకున్న ఘటనపై ఎన్నికల అధికారులు స్పందించాలని, దాడులకు తెగబడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీ ఎన్నికల్లో ఉద్రికత్త నెలకొంది. వైకాపా కార్యకర్తలు.. తెదేపా కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. వైకాపా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి దగ్గరుండి మరీ తమపై దాడులు చేయిస్తున్నారని తెలుగు దేశం కార్యకర్తలు ఆరోపించారు.




అమరావతి: ఏపీలో 35 సర్పంచ్, 245 వార్డు సభ్యుల స్థానాలకు ఇవాళ పోలింగ్ జరుగుతోంది. ఈక్రమంలో పలుచోట్ల వైకాపా అక్రమాలకు తెరలేపింది. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీ ఎన్నికల్లో ఉద్రికత్త నెలకొంది. వైకాపా కార్యకర్తలు.. తెదేపా కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. వైకాపా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి దగ్గరుండి మరీ తమపై దాడులు చేయిస్తున్నారని తెలుగు దేశం కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే, తెదేపా నేత చింతమనేని ప్రభాకర్‌ను గ్రామంలోకి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలం వణుదుర్రు పంచాయతీ ఎన్నికల్లోనూ అక్రమాలు జరుగుతున్నాయని తెదేపా నేతలు మండిపడ్డారు. వైకాపా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కుమారుడు ఆధ్వర్యంలో రిగ్గింగ్ జరుగుతోందని తెలుగుదేశం నేతలు ఆరోపించారు. కాగా, 34 సర్పంచ్, 245 వార్డు సభ్యుల స్థానాలకు మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. అనంతరం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి విజేతలను ప్రకటిస్తారు.

**పాకాల సర్పంచి ఉపఎన్నికలో ఉద్రిక్తత :** ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకాల సర్పంచి ఉపఎన్నికలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఏడుగురు తెదేపా కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొండపి ఎమ్మెల్యే స్వామి ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వైకాపా ఇన్‌ఛార్జిని వదిలి తమను అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే స్వామి ఆరోపించారు.

**బొప్పడంలో తెదేపా, వైకాపా వర్గాల ఘర్షణ :** శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం బొప్పడంలో వైకాపా, తెదేపా వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పలువురు తెదేపా కార్యకర్తలకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.




దిల్లీ: తెలుగు రాష్ట్రాల నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారాస, వైకాపాలకు చెందిన సభ్యులు.. అత్యధిక ఆస్తి విలువలతో జాతీయపార్టీల సభ్యుల కంటే పై స్థానంలో నిలిచారు. పెద్దలసభలో అత్యధిక ఆస్తులున్న ఎంపీలుగా తొలి రెండు స్థానాల్లో భారాస ఎంపీ బండి పార్థసారథిరెడ్డి, వైకాపా ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డిలు నిలిచారు. పార్థసారథిరెడ్డి ఆస్తుల విలువ రూ.5300 కోట్లు కాగా, అయోధ్యరామిరెడ్డి ఆస్తుల విలువ రూ.2,577 కోట్ల మేర ఉంది. రాజ్యసభలో 225 మంది సభ్యుల ఆస్తుల విలువ రూ. 18,210 కోట్లు కాగా.. అందులో వీరిద్దరి సంపదే 43.25 శాతం ఉంది. భారాస, వైకాపాలకు చెందిన 16 మంది ఆస్తుల విలువలో వీరి వాటా ఏకంగా 86.02 శాతం. వీరి తర్వాతి స్థానంలో రూ. 1001 కోట్లతో అమితాబ్ బచ్చన్ సతీమణి, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయాబచ్చన్ నిలిచారు. ప్రస్తుతం రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న 233 మంది సభ్యుల్లో 225 మంది అఫిడవిట్‌లను పరిశీలించి అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. రాజ్యసభలో అతిపెద్ద పార్టీలుగా ఉన్న భాజపా (85) కాంగ్రెస్ (30)లకు చెందిన 115 మంది సభ్యుల మొత్తం ఆస్తుల విలువ రూ.4,128 కోట్లయితే, భారాస (7), వైకాపా (9)లకు చెందిన 16 మంది సభ్యుల ఆస్తి విలువ రూ.9,157 కోట్ల మేర నమోదైంది. ఈ విషయాన్ని ఏడీఆర్ సంస్థ శుక్రవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. పార్టీలవారీగా చూస్తే భారాస సభ్యుల మొత్తం ఆస్తి విలువ రూ.5,596 కోట్లు కాగా, వైకాపా సభ్యులు రూ.3,561 కోట్లు, భాజపా సభ్యులు రూ.2,579 కోట్లు, కాంగ్రెస్ సభ్యులు రూ.1,549 కోట్లు, ఆప్ సభ్యులు రూ.1,316 కోట్లు, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు రూ.1,019 కోట్ల విలువైన ఆస్తులు కలిగి ఉన్నారు. రాష్ట్రాలవారీగా సభ్యుల ఆస్తుల విలువలో తెలంగాణ (రూ.5,596 కోట్లు), ఆంధ్రప్రదేశ్ (రూ.3,823 కోట్లు) తొలి రెండుస్థానాల్లో ఉన్నాయి. ఆ తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ (రూ.1,941 కోట్లు), పంజాబ్ (రూ.1,136 కోట్లు), మహారాష్ట్ర (రూ.1,070) నిలిచాయి. 225 మంది సభ్యుల్లో 27 (12%) మంది అపర కోటీశ్వరులు (బిలియనీర్లు). ఇందులో భాజపా వారు ఆరుగురు, కాంగ్రెస్ నలుగురు, వైకాపా నలుగురు, ఆప్ ముగ్గురు, భారాస ముగ్గురు, ఆర్జేడీ నుంచి ఇద్దరు ఉన్నారు. వీరు ఒక్కొక్కరు రూ.100 కోట్లకు పైగా ఆస్తులు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ ఎంపీల్లో 45%, తెలంగాణ ఎంపీల్లో 43%, దిల్లీ ఎంపీల్లో 33%, పంజాబ్ ఎంపీల్లో 29% బిలియనీర్లు ఉన్నారు. అత్యధిక అప్పులున్న ఎంపీల్లోనూ వైకాపా సభ్యులు తొలి రెండుస్థానాల్లో ఉన్నారు. వీరిలో పరిమళ్ నత్వానీకి రూ.209 కోట్లు, ఆళ్ల అయోధ్యరామిరెడ్డికి రూ.154 కోట్ల అప్పులున్నాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఆదాయం చూపిన ఎంపీల్లో ఆళ్ల అయోధ్యరామిరెడ్డి (రూ.279 కోట్లు), బండి పార్థసారథి రెడ్డి (రూ.140 కోట్లు), అభిషేక్ మనుసింఘ్వీ (రూ.131 కోట్లు) తొలి మూడు స్థానాలను ఆక్రమించారు.

**75 మందిపై క్రిమినల్ కేసులు** : 225 మంది ఎంపీల్లో 75 (33%) మందిపై క్రిమినల్ కేసులున్నాయి. అందులోనూ 41 (18%) మందిపై తీవ్రమైన నేరాలు నమోదయ్యాయి. ఇద్దరు ఎంపీలపై ఐపీసీ 302 సెక్షన్ కింద హత్యకేసులున్నాయి. మరో నలుగురిపై ఐపీసీ 307 కింద హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. ఇంకో నలుగురు ఎంపీలు.. మహిళలపై నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్నారు.. కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌పై ఐపీసీ సెక్షన్ 376 కింద అత్యాచార కేసు ఉంది.




గుంటూరు : మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని పేదలకు అమరావతి రాజధానిలో ఇళ్ల స్థలాల ఆశ చూపించి ఓట్లు పొందాలని వైసీపీ వేసిన ఎత్తుకు తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేశ్ పైఎత్తు వేశారు. నియోజకవర్గంలోని 20 వేల మంది పేదలకు అధికారంలోకి రాగానే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని శనివారం స్పష్టమైన హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర నేడు 2,500 కిలోమీటర్ల మైలురాయిని ఉండవల్లి సమీపంలో అధిగమించింది. అక్కడే 20 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాల హామీ శిలాఫలకాన్ని ఆవిష్కరించి కృష్ణా జిల్లాలోకి యువ నేత అడుగుపెట్టారు. అంతేకాకుండా నియోజకవర్గంలో అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో నివాసం ఏర్పరుచుకొని జీవిస్తోన్న వారందరికి పట్టాలు ఇస్తామని కూడా లోకేశ్ ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం మంగళగిరి నియోజకవర్గంలోని పేదలకు స్థానికంగానే ఇళ్ల స్థలాలు మంజూరు చేయకుండా హైకోర్టు, సుప్రీంకోర్టు వివాదంలో ఉన్న అమరావతి రాజధాని ఆర్ 5 జోన్‌లో ఇళ్ల స్థలాలను ఇస్తామని ఆశ పెట్టింది. స్థలం విలువ రూ.12 లక్షలకు పైగా ఉంటుందని స్వయాన సీఎం జగన్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కేసు విచారణలో భాగంగా నివేశన స్థలాల పట్టాల వరకు పంపిణీ చేసుకోవచ్చని, అయితే అవి కూడా తుది తీర్పునకు లోబడేనని చెప్పింది. ఆయా పట్టాలపై ఎలాంటి థర్డ్ పార్టీ హక్కులు లబ్ధిదారులు కోరడానికి వీల్లేదని కూడా పేర్కొన్నది. అయినప్పటికీ జగన్ సర్కారు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడమే కాకుండా లేఅవుట్‌లు వేసేసి ఇళ్ల నిర్మాణాలకు కూడా శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రెండు కార్యక్రమాలు నిర్వహించి రూ. వంద కోట్లకు పైగా ప్రజాధనాన్ని ఖర్చు చేసింది. అయితే దీనిపై హైకోర్టులో విచారణ జరిగిన అనంతరం ఇళ్ల నిర్మాణాలపై స్టే రావడంతో ఇక తమకు ఇళ్ల స్థలాలు లేనట్లేనన్న భావన లబ్ధిదారుల్లో నెలకొన్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేదలు ఎక్కడైతే నివాసం ఉంటున్నారో వారికి సమీపంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.

అలాంటిది ఎక్కడో 10 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న కృష్ణాయపాలెంలో వైసీపీ ప్రభుత్వం అది కూడా అమరావతి రాజధానిలో ఎలక్ట్రానిక్స్ సిటీకి రిజర్వు చేసిన భూములను పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి రాగానే ఆర్ 5 జోన్‌ని రద్దు చేస్తామని ఇప్పటికే లోకేశ్ స్పష్టం చేశారు. ఎవరైతే మంగళగిరి నియోజకవర్గంలో సొంత ఇల్లు లేకుండా ఉంటున్నారో వారందరికి సమీపంలోనే ఇళ్ల స్థలాలు ఇచ్చి వాటిల్లో ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆయా భూములపై ఎలాంటి కోర్టు వివాదాలు ఉండవు. అంతేకాకుండా ప్రస్తుత నివాసాలకు సమీపంలోనే ఉండటం వలన ఆయా పేదలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ విధంగా వైసీపీ ఎత్తుకు లోకేశ్ చెక్ పెట్టారు.

## బైకును ఢీకొన్న లారీ.. ముగ్గురు మృతి

ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బైకుపై వెళ్తోన్న ముగ్గురిని అటుగా వస్తోన్న లారీ అదుపుతప్పి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని చెబుతున్నారు స్థానికులు. ప్రమాదంలో చనిపోయిన వారు అంబాపురంకు చెందియాన్ వినోద్, నాని, వీరేంద్రగా గుర్తించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే మృతుల బంధువులు అక్కడికి చేరుకుని మృతదేహాలతో నిరసన తెలుపుతున్నారు. రోడ్డుపైన మృతుల బంధువులు భారీ సంఖ్యలో రహదారిపైనే బైఠాయించడంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి.

## లోకేష్‌కు విజయవాడలో అడుగుపెట్టే అర్హత లేదు

### వైయస్ఆర్ సీపీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్

విజయవాడ: నారా లోకేష్‌కు విజయవాడలో అడుగుపెట్టే అర్హత లేదని వైయస్ఆర్ సీపీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు, మూడు శాఖలకు మంత్రిగా లోకేష్.. విజయవాడ నగరానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం వైయస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాల్లో 10 శాతమైనా గతంలో చంద్రబాబు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. తనకు ఓటెయ్యకపోతే అన్నీ కట్ చేస్తానని నంద్యాల ఉపఎన్నికలో చంద్రబాబు అన్నాడని గుర్తుచేశారు. సీఎం వైయస్ జగన్ మాత్రం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. స్వేచ్ఛ సురక్షలో విజయవాడ నగరం మూడో ర్యాంకులో ఉందని, విజయవాడకు ర్యాంకు రావడం టీడీపీకి ఇష్టం లేదన్నారు.

# జిమ్ లో ఈషా రెబ్బ వయ్యారాల వల

ఈషా రెబ్బా అచ్చమైన, స్వచ్ఛమైన తెలుగు అందం. అయితే, తెలుగు అమ్మాయి అనే ట్యాగ్ లైన్ కారణంగానే స్టార్ హీరోయిన్ అయ్యే లక్షణాలు అన్నీ స్పష్టంగా ఉన్నా, ఆ రేంజ్ కి మాత్రం చేరుకోలేకపోయింది. మొదట చిన్న హీరోలతో సినిమాలు చేయడం మొదలుపెట్టిన ఈషా ఇప్పుడు ఇతర భాషల్లోనూ అవకాశాలు అందుకుంటోంది. అంతేకాకుండా, వరసగా వెబ్ సిరీస్ లలోనూ మెరుస్తోంది. ఇటీవల మాయా బజార్ అనే వెబ్ సిరీస్ లో నటించి ఆకట్టుకోగా, ఆ తర్వాత రీసెంట్ గా జెడీ చక్రవర్తితో కలిసి దయా అనే వెబ్ సిరీస్ లోనూ నటించింది. దీనిలో డీ గ్లామర్ లుక్ లో నటించి అందులోనూ నిండు గర్భిణి పాత్ర పోషించి ఆకట్టుకుంది. సినిమాల్లో కంటే వెబ్ సిరీస్ లలోనే ఎక్కువ అవకాశాలు అందుతున్నాయి. అయితే, తనకు అందిన అవకాశాన్ని చాలా చక్కగా



సద్వినియోగం చేసుకుంటోంది. కాగా, ఈ బ్యూటీ సోషల్ మీడియాలో ఎప్పుడూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలను షేర్ చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా జిమ్ లో కసరత్తులు చేసిన తర్వాత ఫోటోలను షేర్ చేసింది. ముఖంపై చెమట స్పష్టంగా కనపడుతోంది. సింపుల్ టీషర్ట్, షార్ట్ ధరించి ఉంది. తన థైస్ అందాలను చూపిస్తూ, ఫిట్ గా ఉండేందుకు తాను ఎంత కష్టపడుతోందో చెప్పకనే చెప్పేసింది. ఇదిలా ఉండగా, ఈషా అంతకు ముందు, ఆ తర్వాత సినిమాలో తెలుగులో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ఈ మూవీ తో ఆమె అందరినీ ఆకట్టుకుంటుంది. ఆ తర్వాత వరసగా అవకాశాలు వస్తాయని అనుకుంది కానీ, రాలేదు. అరవింద సమేతలో సెకండ్ హీరోయిన్ గా నటిచింది. కానీ అది కూడా పెద్దగా ప్రాధాన్యత ఉన్న పాత్ర కాకపోవడంతో, మళ్లీ ఏ స్టార్ హీరో సినిమాలోనూ అవకాశం దక్కలేదు. కానీ, తమిళంలో మాత్రం అవకాశాలు క్యూలు కడుతున్నాయి. విక్రమ్ ప్రభు హీరోగా దర్శకుడు రమేష్ రవిచంద్రన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. క్రైమ్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాలో ఈషా రెబ్బా, విక్రమ్ ప్రభు పోలీస్ ఆఫీసర్లుగా నటించడం విశేషం.

# ఫ్లాప్స్ వచ్చినా ఆగని రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక బాలీవుడ్ లో రాణించేందుకు బాగానే కష్టపడుతోంది. ఆమె పుష్ప సినిమాతో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. దీంతో బాలీవుడ్ లో ఎలాంటి కష్టం లేకుండా వెంట వెంటనే అవకాశాలు చేజిక్కించుకుంది. వరసగా గడ్ బై మిషన్ మజ్నూ వంటి సినిమాల్లో నటించింది. ఆ సినిమాలపై ఎక్కువ ఆశలు పెట్టుకుంది కానీ పెద్దగా ఫలితం దక్కలేదు. ఈ రెండు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. అయితే.. రెండు వరసగా ఫ్లాప్ అయినా కూడా ఆమెకు బాలీవుడ్ లో మరో సినిమా దక్కింది. మరాఠీ యోధుడు మరాఠీ రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. అయితే ఇప్పుడు అలాంటి యుద్ధ వీరుడి కోడలిగా నటించబోతుందట రష్మిక. శివాజీ పెద్ద కుమారుడు శంభాజీ భోంస్లే జీవితం ఆధారంగా.. బాలీవుడ్లో ఓ భారీ పీరియాడికల్



ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నారట. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో బాలీవుడ్ యంగ్ హీరో విక్కీ కౌశాల్ హీరోగా నటించనున్నాడట. శంభాజీ భోంస్లేగా విక్కీ కౌశల్ ఆయన భార్య మహారాణి ఏసుబాయి భోంస్లేగా రష్మికా మందన్నా నటించనున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ సినిమాకు 'ఛావా' అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు టాక్. ఇక ఈ ప్రాజెక్ట్ను భారీ బడ్జెట్తో తెరకెక్కించబోతున్నారట. ఇప్పటికే రష్మిక ఈ ప్రాజెక్ట్కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాదు.. మహారాణిగా ట్రైనింగ్ కూడా స్టార్ట్ చేసేసిందట. అప్పటి యాస భాషతో పాటు యుద్ధ విన్యాసాల ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటోందట. హీరో విక్కీ కౌశాల్ కూడా గత కొద్ది రోజులుగా గుర్రపుస్వారీ కత్తి యుద్ధం విలువిద్య నేర్చుకుంటున్నారని సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ను అఫీషియల్గా ప్రకటించి.. సెప్టెంబర్లో షూటింగ్ స్టార్ట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట. మరి ఛత్రపతి శివాజీ కోడలిగా మహారాణిగా రష్మిక ఎలా మెప్పిస్తుందో చూడాలి. ఇదిలా ఉండగా రష్మిక నటించిన పుష్ప2 షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. ఈ సినిమా కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. పుష్పతో ఆకట్టుకున్న రష్మిక.. పుష్ప2లో ఆమె క్యారెక్టర్ ఎలా సాగుతుందా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# యెదకి ఒక గాయం.. ఖుషిలో ఎమోషనల్ టచ్




రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ లవ్ ఫ్యామిలీ ఎంటర్టైన్ సినిమాతో ఈసారి చాలా క్లాస్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. శివ నిర్వాన దర్శకత్వంలో తెరపైకి రాబోతున్న ఖుషి సినిమాలో సమంత హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమాకు సంబంధించిన పాటలు కూడా సినిమాపై పాజిటివ్ వైబ్రేషన్స్ అయితే క్రియేట్ చేస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్తో పాటలు కూడా ఎంతగానో అట్రాక్ట్ చేశాయి. ఖుషి సినిమా నుంచి ఫస్ట్ విడుదలైన నా రోజా నువ్వే ఏ స్థాయిలో హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక తర్వాత వచ్చిన ఆరాధ్య కూడా అదే రేంజ్ లో ఆకట్టుకుంది. ఇక ఖుషి టైటిల్ సాంగ్ కూడా పరవాలేదు అనిపించింది. అయితే ఇప్పుడు సినిమాలో నుంచి ఊహించిన విధంగా ఒక ఎమోషనల్ సాంగ్ ను విడుదల చేశారు. ఈ సినిమా నుంచి లవ్ పెయిన్ తెలిపే 'యెదకి ఒక గాయం..' లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. యెదకి ఒక గాయం..వదలమంది ప్రాణం ..చెలిమివిడి బంధం..ఎవరు ఇక సొంతం..కలతపడి హృదయం... కరగమంది మౌనం...గతమువిడి పాశం..ఏది ఇక బంధం అంటూ లవ్ ఫీల్ తో సాగుతున్న ఈ పాట క్యారెక్టర్స్ మధ్య బాండింగ్ ను లోతుగా హైలెట్ చేస్తోంది. ఈ పాటకు కూడా చిత్ర దర్శకుడు శివ నిర్వాణ సాహిత్యాన్ని అందించారు. ఇక సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్ స్వరపర్చి ఆయనే పాడారు. సాంగ్ లో సాహిత్యం, సంగీతం ఎంతో అందంగా కలిసిపోయిన ఈ పాట వినగానే మ్యూజిక్ లవర్స్ ఫిదా అవుతున్నారు. విజయ్ దేవరకొండ చూపించిన ఎమోషన్స్ కూడా ఆడియెన్స్ కు హార్ట్ టచింగ్ గా ఉండబోతున్నట్లు అర్థమవుతోంది. ఈ పాట సినిమాకి చాలా ముఖ్యం అని తెలుస్తోంది వచ్చే. అలాగే పాటకు చాలా ఇంపార్టెన్స్ ఇచ్చి పిక్చరైజ్ చేసినట్లు దర్శకుడు చెబుతున్నారు. ఇక సెప్టెంబర్ 1వ తేదీన ఈ సినిమాను గ్రాండ్ గా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతోంది. విజయ్ దేవరకొండ మరోసారి అన్ని భాషల్లో కూడా ప్రమోషన్స్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఇటీవల మ్యూజిక్ ఈవెంట్ కు కూడా మంచి క్రేజ్ వచ్చింది. సమంత కూడా ఈ సినిమా ప్రమోషన్స్ లో బిజీగా పాల్గొనే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

# సింగం తెరంతా కలర్ ఫుల్ గా ఉందే!






బాలీవుడ్ సక్సెస్ ఫుల్ సింగం ఫ్రాంచైజీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అజయ్ దేవగణ్ కథానాయకుడిగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫ్రాంచైజీకి హిందీ మార్కెట్ లో అసాధారణమైన క్రేజ్ ఉంది. ఇప్పటివరకూ రిలీజ్ అన్ని చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్లతో షేక్ చేసాయి. కాప్ యూనివర్శల్ భాగంగా మళ్లీ సింగం ఎగైన్ అంటూ మళ్లీ ఈ ద్వయం రంగం సిద్దం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ముగింపులో సింగం ఎగైన్ సెట్స్ పైకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో సినిమా గురించి లీక్ అయ్యే ఒక్కో అప్ డేట్ అంతకంతకు ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. సింగం ఎగైన్ లో ఈ సారి తెరంతా రంగుల మయం కానుందని తెలుస్తోంది. ఇప్పటికే అజయ్ దేవగణ్ సరసన ఓ స్టార్ హీరోయిన్ ని ఎంపిక చేసే పనిలో ఉన్నారు. అదీ కాక ఇంకా మరింత మంది నాయికల్ని ఈ సిరీస్ లోకి తీసుకొస్తున్నారు. దీపికా పదుకొణే ని ఓ కీలక పాత్రకి సంబంధించి ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తి చేసారు. ఇంత పెద్ద హీరోయిన్ తీసుకొచ్చా రంటే? సినిమాలో ఆమె పాత్ర పవర్ ఫుల్ గా ఉంటుందన్నది గెస్ చేయొచ్చు. దీపిక ఎంట్రీతోనే సింగంకి అదనపు హంగులు యాడ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా మరో స్టార్ హీరోయిన్ ని తెరపైకి తెస్తున్నారు. కరీనా కపూర్ కూడా సినిమాలో భాగమవుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరో కీలక మైన పాత్రలో ఆమెని దించాలని దర్శకుడు భావిస్తున్నాడుట. ఇదే సిరీస్ లో వచ్చిన సింగం రిటర్న్స్ లో ఇప్పటికే కరీనా నటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి సెంటిమెంట్ గా ఆ భామని రంగంలోకి దించుతున్నట్లు తెలుస్తోంది. ఇక మెయిన్ లీడ్ రేసులో ఎంత మంది భామలు పోటీలో ఉన్నారో చూడాలి. కీలక పాత్రలకే స్టార్ హీరోయిన్లనే దించుతున్నారంటే? అజయ్ సరసన భామ అంటే అంతకు మించి ఉండేలా ప్లాన్ చేసే అవకాశం ఉంది. మొత్తంగా సింగం ఎగైన్ తెరంతా రంగులమయం అవ్వడం ఖాయంగా కనిపిస్తుంది.

# రెజీనా కూడా క్యాస్టింగ్ కౌచ్ ఎదుర్కొందా..?

టాలీవుడ్ హీరోయిన్ రెజీనా అందరికీ పరిచయమే. తెలుగుతో పాటు కన్నడ, తమిళ భాషల్లోనూ నటించి అందరినీ ఆకట్టుకుంది. స్టార్ హీరోయిన్ రేంజ్ కి ఎదగకపోయినా, మిడ్ రేంజ్ హీరోలతో మాత్రం నటించింది. చాలా కాలంగా ఇండస్ట్రీలో వివిధ పాత్రల్లో నటించి మెప్పించిన రెజినా, తన కెరీర్ లో క్యాస్టింగ్ కౌచ్ ఎదుర్కొందట. 2005లో కండనాళ్ మొదల్ అనే చిత్రంతో తన కెరీర్ ని మొదలుపెట్టింది రెజీనా. ఆ మూవీ మంచి హిట్ అందుకోవడంతో అన్ని భాషల్లోనూ అవకాశాలు అందుకుంది. ఈ మధ్య సినిమాల్లో అవకాశాలు తగ్గినా, వెబ్ సిరీస్ లలో మాత్రం ఆకట్టుకుంటోంది. అయితే, ఇటీవల రెజీనా ఓ ఇంటర్వ్యూలో షాకింగ్ కామెంట్స్ చేసింది. తాను క్యాస్టింగ్ కౌచ్ కి గురయ్యానని ఆమె చెప్పడం గమనార్హం. రెజీనా పదిహేడు సంవత్సరాల వయసులో తన సినీ కెరీర్ ని ప్రారంభించింది. ఆ సమయంలో తనకు ఊహించని సంఘటనలు ఎదురయ్యాయని ఆమె చెప్పింది. సినిమాల్లో అవకాశాలు



అందుకోవడం కోసం కొందరిని సంప్రదించానని చెప్పింది. వారిలో ఓ వ్యక్తి తనకు ఫోన్ చేసి అవకాశాలు రావాలంటే అడ్జస్ట్ అవ్వాలి అని చెప్పారట. ముందు అడ్జస్ట్ కి ఒకే చెబితే, తర్వాత వెంటనే షూటింగ్ కి వెళ్లొచ్చు అని చెప్పాడట. ఈ మాట విని ఇప్పుడు దాదాపు పది సంవత్సరాలు అయ్యింది అని ఆమె చెప్పారు. ఆ సమయంలో తన వయసు కేవలం 20ఏళ్లు అని చెప్పింది. అయితే, అతని మాటలు ముందు తనకు అస్సలు అర్థం కాలేదని, రెమ్యూనరేషన్ గురించి అడుగుతున్నారేమో అనుకున్నానని, మా మేనేజర్ తో మాట్లాడి చెబుతాను అని ఫోన్ పెట్టేశానని ఆమె చెప్పింది. అయితే, తర్వాత మేనేజర్ తో మాట్లాడిన తర్వాత దాని అర్థం తనకు తెలిసిందని ఆమె చెప్పారు. తనకు ఎదురైన మొదటి చేదు అనుభవం అదేనని, తర్వాత మళ్లీ అలాంటి సంఘటన ఎదురు కాలేదని ఆమె చెప్పారు. కాగా, ఇప్పటి వరకు చాలా మంది హీరోయిన్లు తాము క్యాస్టింగ్ కౌచ్ కి గురయ్యామని చెప్పారు. రెజినా ఇంతకాలం తర్వాత ఈ విషయాన్ని బయటపెట్టడం గమనార్హం.

# మాళవిక సాఫ్ట్ అయినా..ఆలోచనలు మాత్రం మాస్!

మాలీవుడ్ బ్యూటీ మాళవిక నాయర్ టాలీవుడ్ కి సుపరిచితమే. ఎవడే సుబ్రమణ్యం సినిమాతో లాంచ్ అయిన అమ్మడు అటుపై కొన్ని సినిమాల్లో నటించింది. విజయాలు ఉన్నా లేకపోయినా అవకాశాలు మాత్రం బాగానే అందివుచ్చుకుంటుంది. అందం..అభినయం గల నాయిక. చూడటానికి ఎంతో సాఫ్ట్ గానూ కనిపిస్తుంది. మరి ఈ బ్యూటీ మనసులో అన్నీ మాస్ ఆలోచనలే ఉన్నాయా? అంటే అవుననే తెలుస్తోంది. చూడటానికి మాళవిక సాఫ్ట్ గా ఉన్నా..లోపల అంతా ఊర మాస్ లెక్క. డీసెంట్ పాత్రలు పోషించడం కంటే యాక్షన్ నేపథ్యం గల సినిమాలు చేయడం అంటే ఎక్కువ ఇష్టం అంటుంది. దర్శకులు అలాంటి అవకాశాలతో ముందుకొస్తే ఎలాంటి మొహమాటం లేకుండా ఎస్ చెప్పేస్తుందిట.



తన దగ్గరకు ప్రతీ దర్శకుడు తనలో బ్యూటీని చూసి కొన్ని రకమైన పాత్రలకే పరిచయం చేస్తున్నట్లు చెప్పుకోచ్చింది. అలా కాకుండా తనలో మాస్ కోణాన్ని కూడా చూసి ఆ రకమైన పాత్రలతో వస్తే మరింత సంతోషిస్తానని అంటుంది. యాక్షన్ సినిమాలు చేయడం తనకి ఓ డ్రీమ్ గా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం నటిస్తోన్న డెవిల్ సినిమాలో ఆ రకమైన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. అలాగే సినమా ఫలితాలు ఎలాంటి ప్రభావం చూపిస్తాయని ప్రశ్నిస్తే.. కొన్ని విషయాలు మన చేతుల్లో ఉండవు. కథలు ఎంపిక చేసుకోవడం..పాత్రలకు తగంట్టు నటించడం వంటివి మన నియంత్రణలోనే ఉంటాయి. కానీ ఫలితాలు అన్నిసార్లు మనకు అనుకూలంగా రావు. దాన్నివ్యక్తిగతంగా మాత్రం తీసుకోను. చూట్టూ వాతావరణంలో మార్పులు కనిపిస్తాయి. విజయాలు వచ్చినప్పుడు ఒకలా మాట్లాడుతారు. పరాజయాలు ఎదురైనప్పుడు మరోలా స్పందిస్తుంటారు. ఎదుట వారు ఎలా ఉన్నా మనమేంటి? అన్నది మన అంతరాత్మకి తెలుసు. కాబట్టి అలాంటి వాటి గురించి పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదని తెలిపింది. తాజాగా ఈ బ్యూటీ నటించిన అన్ని మంచి శకునాలే సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో సంతోశ్ శోభన్ హీరోగా నటించగా నందిని రెడ్డి దర్శకత్వం వహించారు.



# ప్రతిపక్షాలకు ఈసారి సినిమా చూపిస్తాం

హైదరాబాద్: ఇందిరా పార్కును అద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యత తమదని తెలంగాణ పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. దక్షిణ భారత దేశంలోనే అతి పొడవైన స్టీల్ బ్రిడ్జ్ (వీఎస్టీ-ఇందిరా పార్క్)ను మంత్రి ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చాక హైదరాబాద్‌లో ప్రారంభించిన ఫ్లైఓవర్లలో ఇది 36వదన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన నాయిని నర్సింహారెడ్డి పేరును ఈ స్టీల్ బ్రిడ్జ్‌కు పెట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు చెప్పారు. లోయర్ ట్యాంక్ బండ్, అప్పర్ ట్యాంక్ బండ్‌ను కలిపి అద్భుతంగా మారుస్తామని తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలో కొంతమంది మతం పేరుతో చిచ్చు పెట్టాలని చూస్తున్నారని ప్రతిపక్షాలపై మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రతిపక్షాలకు 2023లోనే సినిమా చూపిస్తామన్నారు. రూ.450 కోట్ల వ్యయంతో మొత్తం 2.63 కి.మీల పొడవైన వీఎస్టీ-ఇందిరా పార్క్ వంతెనను రూ.450 కోట్ల వ్యయంతో స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఆర్‌డీపీ) కింద జీహెచ్‌ఎంసీ నిర్మించింది. రాష్ట్రంలోనే తొలి సారిగా మెట్రో బ్రిడ్జిపై నుంచి స్టీల్



బ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఈ స్టీల్ బ్రిడ్జ్ వల్ల ఇందిరా పార్కు నుంచి వీఎస్టీ స్టీల్ ఫ్లై ఓవర్ (ఎలివేటెడ్ కారిడార్) వలన రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది. ఉస్మానియా యూనివర్సిటీ, హిందీ మహా విద్యాలయం వరకు వెళ్లేందుకు ప్రయాణ సమయం తగ్గుతుంది. ఇందిరా పార్క్, అశోక్ నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ట్రాఫిక్ సమస్య లేకుండా బాగ్ లింగంపల్లి వీఎస్టీ జంక్షన్ వరకు సులభంగా వెళ్లొచ్చు.



# మామ ఎంఎల్‌ఏ టికెట్ కోసం అల్లుడు అల్లు అర్జున్ రంగంలోకి...

గత కొన్ని రోజుల నుండి నల్గొండ జిల్లాలో అల్లు అర్జున్ కట్ అవుట్ లు విపరీతంగా పెట్టారు. అతను కంచర్ల కన్వెన్షన్ ప్లేస్ ఓపెన్ చెయ్యడానికి వస్తున్నాడు అని బాగా ప్రచారం కూడా చేశారు. ఇంతకీ ఆ కన్వెన్షన్ హాల్ కట్టింది ఎవరంటే, స్వయానా అల్లు అర్జున్ కి మామ అయిన కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి. అయితే ఈసారి బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న వారిలో వున్నారని, అందుకే తన బలం చూపించుకోవడానికే ఈ కన్వెన్షన్ హాల్ కట్టి, దానికి తన అల్లుడు అల్లు అర్జున్ ని పిలిచి ఓపెన్ చేయించారని ఒక టాక్ నడుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు తనని నాగార్జున సాగర్ నియోజక వర్గం నుండి పోటీ చెయ్యమంటే తాను పోటీ చెయ్యడానికి సిద్ధం అని చంద్రశేఖర్ రెడ్డి ఇంతకు ముందే చెప్పారు. అయితే ఇప్పుడు మరొకసారి తన వెనక తన అల్లుడు వున్నాడు, అతనికి విపరీతమైన అభిమానులు వున్నారు, వాళ్ళు తనకే ఓటు వేస్తారని అది చూపించడానికే ఈ కన్వెన్షన్ హాల్ కట్టి ఓపెన్ చెయ్యడానికి అల్లు అర్జున్ ని పిలిపించుకున్నాడు అని తెలుస్తోంది. అయితే అల్లు అర్జున్ ఈ హాల్ ఓపెన్ చేసాడు, కానీ రాజకీయంగా ఏమీ మాట్లాడలేదు. తన మామగారు కె చంద్రశేఖర్ రెడ్డి గారు నల్గొండ జిల్లా ప్రజలకు మంచి చెయ్యాలని ఈ కన్వెన్షన్ హాల్ కట్టారు, అది ఈ వూరికి ఉపయోగపడుతుంది, అందుకు మా మామగారిని అభినందిస్తున్నాను అని చెప్పాడు అల్లు అర్జున్.

ఈ ఫంక్షన్ ని ఇంత సక్సెస్ చేసిన చంద్రశేఖర్ రెడ్డి అభిమానులను, అలాగే తన ఆర్మీకి థాంక్స్ చెప్పాడు అల్లు అర్జున్. అయితే ఒకవేళ చంద్రశేఖర్ రెడ్డి కి టికెట్ ఇస్తే కనక, అల్లు అర్జున్ తన మామ కోసం ప్రచారం చేయొచ్చు అనే టాక్ కూడా వుంది. అల్లు అర్జున్ కట్ ఔట్స్ తో పాటు, బీఆర్ఎస్ పార్టీ జెండాలు, కెటిఆర్ కట్ ఔట్స్ కూడా ఈ సభలో బాగా కనిపించాయి. అల్లు అర్జున్ ని చూడటానికి అతని అభిమానులు విపరీతంగా వచ్చారు. అల్లు అర్జున్ కుటుంబం తో సహా ఈ వూరికి వచ్చాడని తెలుస్తోంది. అల్లు అర్జున్ ప్రస్తుతం 'పుష్ప 2' #Pushpa2 షూటింగ్ లో బిజీ గా వున్నాడు. సుకుమార్ దీనికి దర్శకుడు, రష్మిక మందన్న కథానాయకురాలు.



# వ్యవహారం రచ్చ రచ్చ..

## కేటీఆర్, ఎమ్మెల్యే జైపాల్‌ల ఫోన్ కాల్.. రచ్చ రచ్చ అవుతున్న వ్యవహారం..

రంగారెడ్డి : మంత్రి కేటీఆర్ కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ మాట్లాడుకున్న వ్యవహారమంతా బట్టబయలు అయ్యింది. ఇప్పుడు సోషల్ మీడియాలో ఈ వ్యవహారం రచ్చరచ్చ అవుతోంది. కేటీఆర్ కాల్ చేయగానే జైపాల్ యాదవ్ స్పీకర్ ఆన్ చేసి మాట్లాడారు. అసలు ఆ ఫోన్ కాల్‌లో ఏముందంటే.. తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ పార్టీ జాయినింగ్ విషయంలో సార్‌తో మాట్లాడానని జైపాల్‌కు కేటీఆర్ చెప్పారు. పదవుల విషయంలో ఎన్నికల తర్వాత చూద్దామని.. ఇప్పుడైతే జాయిన్ అవమని సార్ చెప్పారని కేటీఆర్ తెలిపారు. మాట్లాడతాను అంటూ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జవాబు ఇచ్చారు. అసలు ఈ ఫోన్ కాల్ వ్యవహారం ఎంత నిజమో కానీ పాలమూరు జిల్లాలో మాత్రం రచ్చ రచ్చ అవుతోంది. బీఆర్ఎస్ ఇప్పటి వరకూ జైపాల్ యాదవ్ అభ్యర్థిత్వం విషయంలో ఏ నిర్ణయం తీసుకోలేదు. ఫోన్ కాల్ వ్యవహారం బహిర్గతం కావడంతో మరింత సంకట స్థితిలో జైపాల్ యాదవ్ ఉన్నట్టు తెలుస్తోంది.



# చదువుకున్న నేతకు ఓటేయమనడం తప్పా..?

దిల్లీ: చదువుకున్న వారికే ఓటువేయాలని విద్యార్థులకు చెప్పిన ఉపాధ్యాయుడిపై ఇటీవల ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ అన్‌అకాడమీ వేటు వేసింది. తమ వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకోవడానికి తరగతి గది సరైంది కాదంటూ ఆయన్ను తొలగించడానికి గల కారణాన్ని వివరించింది. ఇప్పుడు దీనిపై శివసేన నేత ప్రియాంకా చతుర్వేది విమర్శలు గుప్పించారు. 'విద్యావంతుడైన రాజకీయ నాయకుడికి ఓటు వేయమనడం పక్షపాతంతో కూడిన అభిప్రాయం ఎలా అవుతుంది..? అది యువతపై సానుకూల ప్రభావం చూపదా..? కేవలం ఈ అభిప్రాయం వ్యక్తం చేయడం వల్లే ఉద్యోగం తీసేస్తే.. అది సిగ్గుచేటు చర్య. ఆయన అభిప్రాయాన్ని ఎందుకు తప్పుగా భావిస్తున్నారో అర్థం కావడం లేదు. మరోసారి బాలీవుడ్ నటి కాజోల్‌కు జరిగిన ట్రోలింగ్ ఎదురైంది. అయితే.. ఇక్కడ ఉద్యోగం పోయింది' అని అంటూ సంస్థ నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఇదివరకు దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ తొలగింపు వెనక హేతుబద్ధతను ప్రశ్నించారు. దీంతోపాటు ఈ నిర్ణయాన్ని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇదివరకు బాలీవుడ్ నటి కాజోల్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను వెల్లడించారు. 'మార్పు అనేది ఎంతో అవసరం. కానీ ఇండియా లాంటి దేశంలో మార్పు చాలా నిదానంగా జరుగుతోంది. ఎందుకంటే, సంప్రదాయాలు, ఆలోచనా విధానంతో మనం నిమగ్నమైపోయాం. ఇది విద్యపై ప్రభావం చూపుతోంది. అలాగే, విద్యావ్యవస్థపై సరైన అవగాహన లేని రాజకీయ నాయకులు మనకు ఉన్నారు. ఇలా చెబుతున్నందుకు క్షమించాలి. మనల్ని పాలించే చాలామంది నేతలకు విద్యా విధానంపై ఆలోచన లేదు' అని ఆమె అన్నారు. ఈ వ్యాఖ్యలు కాస్త తీవ్ర చర్చకు దారి తీశాయి. పలువురు రాజకీయ నాయకులు సైతం ఆమె వ్యాఖ్యలను తప్పుబట్టారు. దాంతో కాజోల్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అన్‌అకాడమీ తొలగించిన ఆ ఉద్యోగి పేరు కరణ్ సంగ్వాన్. సంస్థ నిర్ణయం తర్వాత ఆయన ఒక యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. దాంట్లో ఈ వివాదం గురించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని చెప్పారు.

# 3 నెలల ముందు డిసైడ్ అయిన మీటింగ్.. అధికారులంతా ఫ్లై ఓవర్ ఇనాగరేషన్‌కి జంప్.. కిషన్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్ : జీహెచ్‌ఎంసీ తీరుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల ముందు నిర్ణయించిన దిశా మీటింగ్‌కు అధికారులు హాజరు కాకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశం ఉన్నా ఫ్లైఓవర్ ఇనాగరేషన్ ఎలా పెట్టుకుంటారని అధికారులను కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణానికి రైల్వే శాఖ ఒప్పుకున్నా జీహెచ్‌ఎంసీ సహకరించడం లేదని కిషన్ రెడ్డి దృష్టికి రైల్వే అధికారులు తెచ్చారు. రెండు రోజుల ముందు ఫ్లైఓవర్ ఇనాగరేషన్ కార్యక్రమం పెట్టుకుని దిశా సమావేశానికి దుమ్మా కొడతారా? ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీ సహకారం లేని కారణంగా పనులు పెండింగ్‌లో పడుతున్నాయి. వారి నుంచి సరైన సహకారం ఉండటం లేదని కిషన్ రెడ్డి ఫైర్ అవుతున్నారు. ఈ సమావేశంలో సమాధానం చెప్పేవారు కూడా లేరన్నారు. రైల్వే పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నా అందుకు తగిన సహకారం ఉండటం లేదన్నారు. హైదరాబాద్ కలెక్టర్ కు జీహెచ్‌ఎంసీ, రైల్వే సిబ్బందిని కోఆర్డినేట్ చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు.

# తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు.. ప్రయాణికుల ఆందోళన

మహారాష్ట్ర: తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మహారాష్ట్రలో ప్రయాణిస్తున్న ఈ రైల్లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎస్-2 బోగీలో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది రైలును నాగ్‌పూర్ సమీపంలో నిలిపివేయడంతో ప్రయాణికులు బోగి నుంచి కిందకు దిగి పరిగెట్టారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని, ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

**ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్‌లోనూ..** అటు కర్ణాటక రాజధాని బెంగళూరులోనూ ఓ రైలుకు ప్రమాదం తప్పింది. కేఎస్ఆర్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. క్షణాల్లో మంటలు వ్యాపించి దట్టమైన పొగ అలుముకుంది. అయితే ప్రయాణికులు రైలు నుంచి దిగిన రెండు గంటల తర్వాత ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.



సమాచారమందుకున్న రైల్వే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు యత్నిస్తున్నారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని రైల్వే అధికారులు వెల్లడించారు.

# మా పీసీసీ చీఫ్‌కు ఏదైనా జరిగితే ఎవరిది బాధ్యత?.. రేవంత్‌కు గన్‌మెన్ల తొలగింపుపై వీహెచ్

హైదరాబాద్: పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డికి గన్‌మెన్‌లను తొలిగించడం దుర్మార్గమని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. "రాష్ట్రమంతా తిరిగే మా పీసీసీ చీఫ్ రేవంత్ కి ఏదైనా జరిగితే బాధ్యత ఎవ్వరిది?. జాతీయ పార్టీ నాయకుడికి భద్రత లేకుండా చెయ్యడంలో ఆంతర్యం ఏమిటి. తక్షణమే నాకు, మా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కి భద్రత కల్పించాలి" అని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఇద్దరు కులగణన చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రెండుసార్లు ప్రధాని మోదీని కలిసినా ప్రయోజనం లేదన్నారు. తెలంగాణాలో 54 శాతం బీసీలు ఉన్నామని.. ప్రత్యేక మంత్రి శాఖను కేటాయించాలని కోరామని తెలిపారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. బీసీ గర్జన నిర్వహణ కోసం బీసీలను చైతన్యం చేసేందుకు రాహుల్ హామీని క్షేత్ర స్థాయికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. తాను ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించానని.. బీసీల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. నిన్న (శుక్రవారం) పీసీసీని భట్టి,మధుయాష్కీలను కలిసానన్నారు. సెప్టెంబర్ 6న తర్వాత బీసీ సభ పెట్టేందుకు సమయం తీసుకోవాలని సూచించారని అన్నారు.



కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ముఖ్య అతిధిగా వస్తారన్నారు. కాంగ్రెస్ బీసీలను ఏకం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌ను చూసి మిగిలిన పార్టీలు కూడా బీసీల వైపు మొగ్గు చూపుతున్నాయన్నారు. సూర్యాపేటలో బీసీల గర్జన సభకు స్థానికులు అడ్డు చెప్పారని.. అందువల్ల హైదరాబాద్ నగర శివారులో సభ పెట్టాలని భావిస్తున్నామని.. కనీసం రెండు లక్షల మందితో సభ పెడతామని వీహెచ్ వెల్లడించారు.

# శౌచాలయంలో బంధించి మూగ మహిళపై అత్యాచారం



హైదరాబాద్: నగరంలోని హుమాయున్‌నగర్ పీఎస్ పరిధిలో దారుణం జరిగింది. చెవిటి, మూగ మహిళపై ఓ యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. ఇంటికి ఎదురుగా ఉండే సాయి అనే యువకుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహిళను శౌచాలయంలో బంధించి అత్యాచారం చేశాడు. మహిళ భర్త కూడా దివ్యాంగుడే. తన తల్లిని తీసుకుని అతను బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లోకి చొరబడిన సాయి ఈ దారుణానికి పాల్పడ్డాడు. బాధితురాలు మూగ కావడంతో అరవలేకపోయింది. ఆపై శౌచాలయంలోనే మహిళను ఉంచి గడియపెట్టి వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చి గమనించిన భర్త.. ఏమైందని అడగడంతో ఆమె జరిగిన దారుణాన్ని వివరించింది. దీంతో హుమాయున్ నగర్ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాయిని అరెస్టు చేశారు. గతంలోనూ అతని చేష్టలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ట్రాన్స్‌జెండర్ల వేషం వేసుకుని బెగ్గింగ్.. బీహారీ బ్యాచ్ అరెస్ట్

హైదరాబాద్: నగరంలో మరో బెగ్గింగ్ రాకెట్ గుట్టును పోలీసులు రట్టు చేశారు. ట్రాన్స్‌జెండర్ల వేషంలో బెగ్గింగ్ చేస్తున్న కొందరిని గుర్తించి అరెస్ట్ చేశారు. వీళ్లంతా బీహార్‌కు చెందిన వాళ్ళుగా నిర్ధారించుకున్న పోలీసులు.. ఈ ముఠా వెనుక ఉన్న ఐదుగురు నిర్వాహకుల్ని సైతం అరెస్ట్ చేశారు. ప్రజలను బెదిరిస్తూ.. ఇబ్బందులకు గురి చేస్తూ డబ్బులు గుంజుతున్న ఈ నకిలీ ట్రాన్స్‌జెండర్ల గురించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారం అందుకున్నారు. సికింద్రాబాద్, ప్యారడైజ్, జూబ్లీహిల్స్ స్టేషన్ ప్రాంతంలో వీళ్లు హంగామా చేస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు 15 మందిని అరెస్ట్ చేశారు. వీళ్లంతా బీహార్‌కు చెందిన వాళ్లని.. ఈ ముఠాను ఐదుగురు వెనకుండి నడిపిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. హిజ్రాల్లాగా వేషాలు వేసుకుని.. ఇళ్లకు తిరుగుతూ.. సిగ్నల్స్ దగ్గర, షాపింగ్ మాల్స్ వద్ద హల్ చేస్తోంది ఈ బ్యాచ్. ఈ ముఠాకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మీడియాకు తెలియజేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. వృద్ధులతో భిక్షాటన చేయిస్తున్న భారీ బెగ్గింగ్ మాఫియా ఒకటి




తాజాగానే బయటపడింది. ఈ ముఠా వెనుకున్న అనిల్ పవార్ అనే వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు కూడా.

పలు ప్రాంతాల నుంచి వృద్ధులకు తీసుకొచ్చి ఒక్కొక్కరికి రూ.200లు ఇచ్చి హైదరాబాద్ లో పలు ప్రాంతాల్లో భిక్షాటన చేయించి ముష్టి మాఫియా రన్ చేస్తున్నాడు అనిల్ పవార్.

# కేసీఆర్‌ను ఎదుర్కోలేమన్న మురళీధరరావు వ్యాఖ్యలపై బండి సంజయ్ ఏమన్నారంటే..

కరీంనగర్ : తెలంగాణలో సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోవడం కష్టమని బీజేపీ కీలక నేత మురళీధరరావు చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో సంచలనంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై నేడు ఎంపీ బండి సంజయ్‌ని విలేఖరి వివరణ కోరగా... మురళీధర్ రావు మాట్లాడింది తాను చూడలేదన్నారు. కరోనా కాలంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ప్రజలను పట్టించుకోలేదని ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్‌లు యథా రాజా.. తథా ప్రజా అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయన్నారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదన్నారు. పెద్దపల్లిలో బాలికను గ్యాంగ్ రేప్ చేస్తే.. ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దిశ కంటే దారుణమైన ఘటన పెద్దపల్లిలో జరిగిందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒత్తిడి ఉందన్నారు. ప్రభుత్వం బరి తెగించిందని.. మధ్య ప్రదేశ్ సీఎంతో మాట్లాడతానన్నారు.



హిందూ అమ్మాయిలను కిడ్నాప్ చేస్తే.. ప్రభుత్వానికి పట్టదా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. ఎంపీలంతా ఎమ్మెల్యేలుగా పోటీ చేయాలని అధిష్టానం చెప్పలేదని బండి సంజయ్ అన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com